# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 8

శనివారం, జూలై 20, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## గ్రూప్ -2 పరీక్షలు వాయిదా.. TGPSC అధికారిక ప్రకటన

హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్ 2 పరీక్షలు వాయిదా పడ్డాయి. డీఎస్సీ, గ్రూప్ -2 పరీక్షల మధ్య వారం రోజులు మాత్రమే వ్యవధి ఉండటంతో.. ఈ పరీక్ష వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం సచివాలయంలో గ్రూప్-2 అభ్యర్థులతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు చర్చలు జరిపారు. అనంతరం పరీక్షల వాయిదాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆగస్టులో జరగాల్సిన గ్రూప్-2 పరీక్షలను డిసెంబర్‌కు రీషెడ్యూల్ చేయాలని నిర్ణయించింది. డిసెంబర్‌లో నిర్వహించే పరీక్షల తేదీలను తర్వాత ప్రకటించనున్నట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ఓ ప్రకటనలో తెలిపారు.

మొత్తం 783 గ్రూప్- 2 పోస్టుల భర్తీకి షెడ్యూల్ ప్రకారమైతే.. ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు జరగాల్సి ఉంది. మరోవైపు, 1,388 గ్రూప్ -3 ఉద్యోగ రాత పరీక్షలను సైతం వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్ -3 పరీక్షలు జరగాల్సి ఉంది. రాష్ట్రంలో గ్రూప్ -2 ఉద్యోగాలకు 5.51లక్షల మంది, గ్రూప్ 3 పోస్టులకు 5లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

## విండోస్‌లో సాంకేతిక సమస్య..
# ప్రపంచవ్యాప్తంగా కలకలం



**ఆగిపోయిన వందలకొద్దీ విమానాలు**

**విమానాశ్రయాల్లో ప్రయాణికుల గగ్గోలు**

**బ్యాంకింగ్ సేవలకు కుదుపు.. స్టాక్ మార్కెట్లకు భారీ దెబ్బ**

**సమస్యను పరిష్కరించామన్న దిగ్గజ టెక్ సంస్థ**

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ ఆధారిత రంగాలన్నీ శుక్రవారం చిగురుటాకులా వణికిపోయాయి. చిన్న సాంకేతిక సమస్య ఒక్కసారిగా ప్రపంచాన్ని కలవరపాటుకు గురిచేసింది. అనేక దేశాల్లో విమానయాన సంస్థలు, రైల్వేలు, టెలికమ్యూనికేషన్, బ్యాంకింగ్, మీడియా, ఆసుపత్రుల సేవలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. మిగతా దేశాలతో పోల్చుకుంటే భారత్‌లో దీని ప్రభావం తక్కువగానే కనిపించింది. కంప్యూటర్ సేవల సంస్థ మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య దీనికి ప్రధాన కారణం. ఈ సమస్య వెనక భద్రతా పరమైన ఘటన లేక సైబర్ దాడి లేదని మైక్రోసాఫ్ట్‌కు సైబర్ సెక్యూరిటీ సేవలు అందించే క్రౌడ్‌స్ట్రైక్ సీఈవో జార్జ్ కుర్ట్జ్ పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ విండోస్‌తో పనిచేసే కంప్యూటర్లలో తాము విడుదల చేసిన 'అప్‌డేట్'లో లోపాల కారణంగానే సమస్య తలెత్తిందని క్రౌడ్‌స్ట్రైక్ వెల్లడించింది. కొద్ది గంటల్లోనే సమస్యను గుర్తించామని, దాన్ని పరిష్కరించామని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. అయితే కొన్నిచోట్ల చిన్నచిన్న అవశేష సమస్యలున్నాయని త్వరలోనే అవీ పరిష్కారమవుతాయని పేర్కొంది.

### తీవ్ర ప్రభావం

తాజా సాంకేతిక సమస్యతో మైక్రోసాఫ్ట్ సంస్థ సేవలు అంతర్జాతీయంగా ప్రభావితమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా దిగ్గజ టెక్ సంస్థ సేవలను పొందుతున్న అనేక సంస్థలకు తమ కంప్యూటర్లను యాక్సెస్ చేసే వీలు లేకుండా పోయింది. వేల మంది యూజర్లకు బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ దర్శనమిచ్చింది. పలు విమాన సర్వీసులు రద్దుకావడంతో విమానాశ్రయాల్లో ప్రయాణికులు తీవ్ర అవస్థలు

- మిగతా 2వ పేజీలో

# మూడో తరగతి వరకు అంగన్‌వాడీలో విద్యాబోధన



**ప్రతి కేంద్రానికి ఒక టీచర్ నియామకం**

**4 నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్ బడులు**

**విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తాం**

**విద్యావేత్తలు, విశ్రాంత ఐఏఎస్ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి**

**త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడి**

హైదరాబాద్: విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్లేస్కూళ్ల తరహాలో అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దడంతో పాటు అక్కడే మూడో తరగతి వరకు విద్య అందించే దిశగా ప్రతి కేంద్రంలో విద్యాబోధనకు ఒక టీచర్‌ను నియమించాలని యోచిస్తున్నామన్నారు. శుక్రవారం సచివాలయంలో విద్యావేత్తలు, విశ్రాంత అధికారులతో సీఎం సమావేశమయ్యారు. విద్యారంగంపై, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై చర్చించారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, జానయ్య, పద్మజా షా, విశ్వేశ్వరరావు, శాంతా సిన్హా, విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఆకునూరి మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "నేను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నాం. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి కచ్చితంగా బడ్జెట్ పెంచుతాం. 4 నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలు చదువుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం కల్పించేందుకు యోచిస్తున్నాం. గురుకుల పాఠశాలలకు సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగిస్తాం. విద్య, వ్యవసాయ రంగాల సమస్యల పరిష్కారానికి త్వరలో కమిషన్లు ఏర్పాటు చేయబోతున్నాం. విద్యా కమిషన్ ద్వారా విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరిస్తాం. కార్పొరేట్ బడుల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించాం. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత ఇప్పటికే స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించాం. యూనివర్సిటీలకు వీసీలు, బోధన, బోధనేతర సిబ్బందిని నియమిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యావ్యవస్థ బలోపేతమే

- మిగతా 2వ పేజీలో



## రాజీనామా చేస్తానని చెప్పి.. హరీశ్‌రావు మాట మారుస్తున్నారు

**ఎంపీ మల్లు రవి**

హైదరాబాద్: రైతు రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పుడు.. మాట మారుస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం ఛైర్మన్ మల్లు రవి, ఎంపీలు బలరాం నాయక్, రఘురాంరెడ్డిలు ఆరోపించారు. రాజీనామా చేయకుండా తప్పించుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ మాట ఇచ్చింది అంటే.. చేసి తీరుతామని నిన్నటి ఘటనతో ప్రతిపక్షాలకు తెలిసొచ్చిందన్నారు. ఏక కాలంలో రూ.31వేల కోట్ల రుణ మాఫీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. ఇంత పెద్ద మొత్తంలో రైతులకు రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ఎంపీల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఇక గుజరాత్ మోడల్ లేదని, అంతా తెలంగాణ మోడల్‌ను అనుసరించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. పదేళ్లలో భారాస చేయలేని పనిని తమ ప్రభుత్వం ఏడు నెలల్లోనే చేసి చూపించిందన్నారు.



## రైతు భరోసాపై శాసనసభలో ఒకరోజు చర్చ

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

కరీంనగర్ పట్టణం : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిర్వహించిన కార్యశాలల్లో రైతు భరోసాపై రైతులు వెల్లడించిన అభిప్రాయాలను చర్చించడానికి శాసనసభ సమావేశాల్లో ఒకరోజు సమయం కేటాయిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో రైతు భరోసా కార్యశాలను మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపసంఘం ఛైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మినహా.. మిగిలిన సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ శాసనసభలో చర్చ అనంతరం విధానపరమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. కౌలు రైతులకు ఎలా సాయం అందించాలనే విషయమై అభిప్రాయాలను తెలియజేసేందుకు ప్రత్యేక పత్రాలను వ్యవసాయశాఖ ద్వారా అందజేస్తామని, రైతులు తమ అభిప్రాయాలను పంపాలని సూచించారు. అంతకుముందు ఒక రైతు మాట్లాడుతూ రైతుభరోసా ఎత్తివేసి పంటల బీమా ప్రీమియం చెల్లించి, పంట నష్టపోయినప్పుడు నష్టపరిహారం అందేలా చూస్తే బాగుంటుందని పేర్కొనడాన్ని మంత్రి ప్రస్తావిస్తూ.. ఆయన సూచన మంచిదేనన్నారు.

- మిగతా 2వ పేజీలో



## పెద్దవాగు ప్రాజెక్టుకు గండి..
# వరదలో కొట్టుకుపోయిన వందలాది పశువులు

అశ్వారావుపేట రూరల్: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో పెద్దవాగు ప్రాజెక్టుకు గురువారం రాత్రి భారీ గండి పడింది. దీంతో నీళ్లన్నీ దిగువకు వెళ్లడంతో ప్రాజెక్టు ఖాళీ అయింది. ప్రాజెక్టు కట్ట తెగి వందల సంఖ్యలో పశువులు కొట్టుకుపోయాయి. వరద ప్రవాహానికి వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. పలు గ్రామాల ప్రజలు కొండలు, ఎత్తయిన భవనాల్లో రాత్రంతా తలదాచుకున్నారు. ఏం జరుగుతుందో తెలియక పరుగులు తీశారు. గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో సహాయక చర్యలకు వీలు లేకుండా పోయింది.

### భద్రాచలం వద్ద పెరుగుతున్న వరద ఉద్ధృతి

ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరడంతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గురువారం 20 అడుగులు వద్ద ఉన్న వరద.. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి 24.5 అడుగులకు చేరింది. గోదావరికి ఎగువ ప్రాంతంలో ఉన్న పేరూరులో ఉదయం 9 గంటలకు 40.86 అడుగులు నమోదైంది. ఇంద్రావతి, పేరూరు వైపు నుంచి వరద భద్రాచలం గుండా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో భద్రాచలంలో ప్రమాద స్థాయికి వరద చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

43 అడుగులు వరద వస్తే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. 48 అడుగులకు వస్తే రెండు, 53 అడుగులకు వస్తే మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. గోదావరి ప్రాంతంలో వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సెక్టోరియల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గజ ఈతగాళ్లు, పడవలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### స్తంభించిన జన జీవనం

వరదల కారణంగా అశ్వారావుపేట మండలంలోని నాలుగు గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాల్లో జనజీవనం స్తంభించిపోయింది. వరదలు దాటికి వందల ఎకరాల్లోని పంటలు కొట్టుకుపోయాయి. ముంపు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం

- మిగతా 2వ పేజీలో



## సర్కారు మార్గదర్శకాలే మాఫీకి మరణ శాసనాలు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, జూలై19: రాష్ట్రంలో రుణమాఫీ అయిన రైతులకన్నా.. కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని, సర్కారు రూపొందించిన మార్గదర్శకాలు రుణమాఫీ పథకానికి మరణ శాసనాలయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అన్నివిధాలా అర్హతఉన్నా.. ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పేవారేలేరని, .రైతుల గోడు వినేవారే లేరని శుక్రవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఆందోళనలో ఉంటే సంబరాలు జరుపుకోవడమేంటని ప్రశ్నించారు. జూన్‌లో వేయాల్సిన రైతుభరోసా..

- మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
హైదరాబాద్
శుక్రవారం, 19 జూలై 2024

# మూడో తరగతి వరకు అంగన్‌వాడీలో విద్యాబోధన

- మొదటిపేజీ తరువాయి

లక్ష్యంగా 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేశాం. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాం. విద్యావేత్తలు ఇచ్చే సూచనలు స్వీకరిస్తాం. వీసీల నియామకానికి ఇప్పటికే సెర్చ్ కమిటీలు వేశాం. త్వరలోనే నియామకాలు పూర్తవుతాయి" అని ముఖ్యమంత్రి వివరించారు.

విశ్వవిద్యాలయాల్లో గత పదేళ్లుగా నియామకాలు లేవని విద్యావేత్తలు, విశ్రాంత అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ప్రతి 15 రోజులకోసారి విద్యావ్యవస్థపై సమీక్ష జరపాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధన నైపుణ్యం ఉండటం లేదని, కేంద్రాల్లో సరైన వసతులు లేవని, ప్రభుత్వ పాఠశాలల్లో పలు సమస్యలు ఉన్నాయని వారు వివరించారు. విద్యా సూచికలో తెలంగాణ అట్టడుగున ఉందని, ఓయూలోనూ విద్యాప్రమాణాలు పడిపోయాయని ప్రొఫెసర్లు హరగోపాల్, శాంతా సిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థ బలోపేతానికి తాము ఇప్పటికే మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని వారికి ముఖ్యమంత్రి తెలిపారు. విద్యావ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై విధానపత్రం రూపొందిస్తే.. దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆయా అంశాలపై మంత్రివర్గ ఉపసంఘంతోనూ చర్చించాలని వారికి సూచించారు. విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు అతి తక్కువ వడ్డీకి దీర్ఘకాల రుణాలు ఇస్తాయని, ఇప్పటికే పలు రాష్ట్రాలు వాటి సాధనకు ప్రయత్నిస్తున్నాయని ప్రొఫెసర్ జానయ్య తెలిపారు. ఆ అంశాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 11 శాతంగా ఉన్న విద్యాశాఖ బడ్జెట్ తెలంగాణ ఏర్పడిన తర్వాత 6.4 శాతానికి పడిపోయిందని, విద్యావ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంపు అవసరమని హరగోపాల్ సూచించారు. బడ్జెట్ కేటాయింపులు తప్పకుండా పెంచుతామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు.

# రైతు భరోసాపై శాసనసభలో ఒకరోజు చర్చ

- మొదటిపేజీ తరువాయి

అయినా రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ, పంటల బీమా, రైతు భరోసా, పంట ధాన్యానికి బోనస్ అమలు చేస్తామన్నారు. పంటల బీమా, పంట నష్టపరిహారం, వ్యవసాయ పనిముట్లకు రాయితీ విషయంలో త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

ఉపసంఘం సభ్యుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా డబ్బులను రుణమాఫీ కోసం వెచ్చిస్తున్నట్లు ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, భరోసాకు రుణమాఫీకి తేడా తెలియని వారు గతంలో ఎలా పాలన చేశారో అర్థం కావట్లేదని ఎద్దేవా చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రుణమాఫీపై స్పందించిన భారాస నేత కేటీఆర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లు గతంలో రైతుల సమస్యలపై ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. ఉపసంఘం సభ్యుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతుల రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లను తమ ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతు భరోసా కార్యక్రమంలో అభిప్రాయాలు తెలియజేయని వారు లిఖితపూర్వకంగా వ్యవసాయాధికారులకు ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఆధార్ లింక్ లేని రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. అంతకుముందు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై శనివారం దిల్లీలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణులతో సమావేశం ఉందని, తనతోపాటు నీటిపారుదలశాఖ కార్యదర్శి, ఈఎన్సీ హాజరవుతున్నట్లు ఉత్తమ్ చెప్పారు. భారాస ప్రభుత్వంలో ప్రాజెక్టులు నీళ్లకోసం కాదు.. పైసల కోసం కట్టారని స్పష్టమైందని విమర్శించారు. కొత్త రేషన్ కార్డుల జారీపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, ఆరోగ్యశ్రీకి వేరే కార్డులు ఇస్తామని మంత్రులు తెలిపారు.

# పెద్దవాగు ప్రాజెక్టుకు గండి..

- మొదటిపేజీ తరువాయి

నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పదుల సంఖ్యలో కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. గ్రామాల మధ్య ప్రజా రవాణా నిలిచిపోయింది. రోడ్లు ఎక్కడికక్కడ ధ్వంసమయ్యాయి. పెదవాగు ప్రాజెక్టుకు ఆనుకోని ఉన్న గ్రామాల్లోని పలు ఇళ్లల్లో నిత్యావసర సామగ్రి కొట్టుకుపోయింది.

### తీవ్ర అల్పపీడనం.. తెలంగాణలో పలు జిల్లాలకు భారీ వర్షసూచన

దక్షిణ, ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారింది. రానున్న 12 గంటల్లో ఇది వాయుగుండంగా మారే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. హైదరాబాద్‌లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

### తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద.. 24 గేట్లు ఎత్తివేత

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న చత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో శుక్రవారం 24 గేట్లు ఎత్తి 59 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువన గోదావరికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 60,297 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో క్రమేపీ వరద ఉద్ధృతి పెరుగుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ ఉపేందర్ తెలిపారు. మరో పక్క చింతవాగు, పగిడి వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి.

### బంగాళాఖాతంలో వాయుగుండం.. తెలంగాణపై తీవ్ర ప్రభావం

హైదరాబాద్: తీవ్ర అల్పపీడనం వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల 24 గంటల్లో ఒడిశాలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొంది. వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, తెలంగాణపై దీని ప్రభావం ఇవాళ, రేపు ఎక్కువగా ఉంటుందని ప్రకటించింది. విస్తారంగా వర్షాలతో పాటు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈశాన్య, తూర్పు జిల్లాలైన కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. శనివారం ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురవొచ్చు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదారాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది.

## విండోస్‌లో సాంకేతిక సమస్య..

# ప్రపంచవ్యాప్తంగా కలకలం

- మొదటిపేజీ తరువాయి




పడ్డారు. భారత్‌లోని పలు విమానాశ్రయాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. బెంగళూరు విమానాశ్రయం టెర్మినల్ 1 నుంచి 90 శాతం విమాన సర్వీసులపై ప్రభావం చూపించినట్లు సమాచారం. ఇండిగో, విస్తారా, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ తదితర విమానయాన సంస్థలకు చెందిన డజన్ల కొద్ది సర్వీసులు రద్దయ్యాయి. మైక్రోసాఫ్ట్ అజూర్ సర్వర్లలో సాంకేతిక సమస్య కారణంగా తమ సేవలకు అంతరాయం ఏర్పడినట్లు దిగ్గజ విమానయాన సంస్థలైన స్పైస్‌జెట్, ఇండిగో ప్రకటించాయి. దీంతో ప్రయాణికులను మాన్యువల్‌గా తనిఖీ చేసి చేతి రాతతో కూడిన బోర్డింగ్ పాస్‌లు ఇస్తున్నారు.

### ఇబ్బందులు పడ్డ వీసా, అమెజాన్

మైక్రోసాఫ్ట్ సర్వర్లలో సాంకేతిక సమస్యతో అమెరికన్ ఎయిర్‌లైన్స్, డెల్టా వంటి విమానయాన సంస్థలతోపాటు వీసా, ఏడీటీ సెక్యూరిటీ, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలు ఇబ్బందిపడ్డాయి. ఆస్ట్రేలియాలో ప్రధాన మీడియా సంస్థలైన ఏబీసీ, స్కై న్యూస్ టీవీ, రేడియో ప్రసారాలు నిలిచిపోయాయి. బ్రిటన్, ఐరోపా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సహా వేర్వేరు దేశాల్లోని ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లు జారీ సహా ఇతర సేవలు అందించడానికి వీల్లేకుండా పోయింది. ఫలితంగా మాన్యువల్‌గా బోర్డింగ్ పాస్‌లు జారీ చేయాల్సి రాగా ప్రయాణాలు ఆలస్యమయ్యాయి.

### దేశీయంగా స్వల్ప అవాంతరాలే : ఆర్‌బీఐ

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలతో మనదేశంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ (బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ)లు, స్టాక్‌బ్రోకింగ్ సంస్థల కార్యకలాపాలకు స్వల్ప అంతరాయం కలిగింది. దాదాపు 10 బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, నెమ్మదిగా మళ్లీ సాధారణ పరిస్థితి నెలకొన్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించినట్లు పేర్కొంది. 'కేవలం కొన్ని బ్యాంకులు మాత్రమే క్రౌడ్‌స్ట్రైక్ టూల్ వినియోగిస్తున్నాయి. బ్యాంకుల్లోని కీలక సిస్టమ్స్ క్లౌడ్ నెట్‌వర్క్ మీద లేవు. అందువల్ల కొన్ని చిన్న ఇబ్బందులు మాత్రమే కనిపించాయి' అని ఆర్‌బీఐ వివరించింది. మొత్తం మీద చూస్తే మైక్రోసాఫ్ట్ సిస్టమ్స్ వైఫల్య ప్రభావం మనదేశంలో ఎంతో తక్కువని పేర్కొంది.

### బ్యాంకులు

బ్యాంకులు తక్కువ సమయంలోనే సమస్యను సరిదిద్ది మళ్లీ కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకురాగలిగాయి. అతిపెద్ద ప్రభుత్వ బ్యాంకు అయిన ఎస్‌బీఐ, తమ కార్యకలాపాలపై ప్రభావం లేదని ప్రకటించింది. 'మా బ్యాంకులో అన్ని సిస్టమ్స్ బాగున్నాయి' అని ఎస్‌బీఐ ఛైర్మన్ దినేష్ ఖరా తెలిపారు. ప్రైవేటురంగ దిగ్గజ బ్యాంకులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ తమ కార్యకలాపాలు యథాతథంగా సాగాయని వివరించాయి.

### స్టాక్ బ్రోకింగ్ సంస్థలు

కొన్ని దేశీయ స్టాక్‌బ్రోకింగ్ సంస్థల కార్యకలాపాలకు ఇబ్బంది తలెత్తింది. ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, ఏంజెల్ వన్, 5పైసా..తదితర సంస్థలు ఇందులో ఉన్నాయి. మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్, ఎడెల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ కార్యకలాపాలకు సమస్యలు ఎదురయ్యాయి. ఈ సమస్యలను సత్వరం పరిష్కరించి, కార్యకలాపాలను మళ్లీ సాధారణ స్థితికి తీసుకువచ్చినట్లు ఈ సంస్థలు ప్రకటించాయి.

### స్టాక్ ఎక్స్ఛేంజీలు

దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీలైన ఎన్ఎస్ఈ, బీఎస్ఈ నిరాటంకంగా తమ కార్యకలాపాలు నిర్వహించాయి. 'మైక్రోసాఫ్ట్ సాంకేతిక సమస్యల ప్రభావం మాపై లేదు, అన్ని రోజుల మాదిరిగానే ఈ రోజు కూడా కార్యకలాపాలు యథాతథంగా కొనసాగాయి' అని ఎన్ఎస్ఈ, బీఎస్ఈ వర్గాలు స్పష్టం చేశాయి. కానీ ఈ వ్యవహారం స్టాక్‌మార్కెట్‌పై ప్రభావం చూపింది. వివిధ రంగాల షేర్ల ధరలు క్షీణించాయి. సూచీలు కూడా భారీగా పతనమయ్యాయి.

### ప్రయాణికులకు ఆహారం అందించండి: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

'విమానాల ఆలస్యం కారణంగా ప్రభావితమైన ప్రయాణికులకు అదనపు సీటింగ్, నీరు, ఆహారాన్ని అందించాలని విమానాశ్రయ అధికారులను, విమానయాన సంస్థలను ఆదేశించాను. ప్రయాణికులు ఎయిర్‌పోర్టు సిబ్బందితో సహకరించాలి" అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విజ్ఞప్తి చేశారు.

# పత్రాలన్నీ సక్రమంగా ఉంటే వారం రోజుల్లో రిజిస్ట్రేషన్



హైదరాబాద్, జూలై 19: వివాదాలు పరిష్కారమైన భూముల్లో సైతం ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు పలువురు సబ్‌రిజిస్ట్రార్‌లు నిరాకరిస్తున్న నేపథ్యంలో హైకోర్టు పలు మార్గదర్శకాలు జారీచేసింది. వివాదాలు పరిష్కారమైనప్పటికీ తాజాగా కోర్టు ఉత్తర్వులు తీ స ు క ు రా వా ల ం ట ూ సబ్‌రిజిస్ట్రార్‌లు ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు నిరాకరిస్తున్న నేపథ్యంలో హైకోర్టులో పలు పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం కోర్టు తీర్పులను అర్థం చేసుకోకుండా సబ్‌రిజిస్ట్రార్‌లు పౌరులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం పలు మార్గదర్శకాలు జారీచేసింది. " రిజిస్ట్రేషన్‌కు వచ్చిన డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చట్టం-1908, ఇండియన్ స్టాంప్ యాక్ట్ ప్రకారం సక్రమంగా ఉంటే వారంలో రిజిస్ట్రేషన్ చేయాలి. లేదంటే తిరస్కరిస్తున్నట్లు లిఖితపూర్వకంగా కారణాలు వివరించాలి.

డాక్యుమెంట్లను తిరస్కరిస్తే స్టాంపుడ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీల వాపసు చేసే ప్రక్రియను సరళీకృతం చేయాలి. కోర్టు వివాదాలు ముగిసి.. ఎలాంటి అప్పీళ్లు పెండింగ్‌లో లేనప్పుడు మళ్లీ కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలని పౌరులను ఇబ్బందులకు గురిచేయకుండా ఉన్నతాధికారులు వి?ధివిధానాలు జారీచేయాలి. తీర్పులు వెలువడిన లేదా పిటిషన్‌లు కొట్టేసిన కేసుల్లో డాక్యుమెంట్లను తిరస్కరించరాదు. ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జనరల్ డైరీ లేదా వాచ్ రిజిస్టర్ నిర్వహించాలి. అక్రమాలు, మధ్యవర్తుల జోక్యం లేకుండా రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన పౌరుల వరుస సంఖ్య, తేదీ, సమయం అందులో రాయాలి. ఇవికాకుండా పలు కేసుల్లో హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు పాటించాలి" అని ధర్మాసనం పేర్కొంది.

# సర్కారు మార్గదర్శకాలే మాఫీకి మరణ శాసనాలు

- మొదటిపేజీ తరువాయి

జూలై వచ్చినా రైతుల ఖాతాలో వెయ్యలేదని, కౌలు రైతులకు.. ఇస్తానన్న రూ.15 వేలు ఇయ్యనేలేదన్నారు.

### పేదరిక నిర్మూలనలో తెలంగాణ రెండోస్థానం హర్షణీయం

పేదరికలో నిర్మూలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలో రెండోస్థానంలో ఉందని నీతిఆయోగ్ నివేదికలో పేర్కొనడం హర్షణీయమని కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పదేళ్లపాటు తెలంగాణలో పేదరిక నిర్మూలనతోపాటు సుస్థిర అభివృద్ధికోసం కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. తాజాగా విడుదల చేసిన సస్టెయినబుల్ డెవల్‌పమెంట్ గోల్స్ (ఎస్‌డీజీ) లెక్కలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. గతప్రభుత్వం రాష్ట్రాన్ని మెరుగైన స్థితికి చేర్చిందని ఈ ప్రభుత్వం కూడా ఆ స్ఫూర్తిని కొనసాగించి అభివృద్ధివైపు నడిపించాలని సూచించారు.

# రసాభాసగా స్టాఫ్‌నర్సుల బదిలీల కౌన్సెలింగ్

**తప్పులతడకగా సీనియారిటీ జాబితాలు**

**సవరించాలని స్టాఫ్‌నర్సుల ఆందోళన**

**బదిలీలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన ప్రజారోగ్య శాఖ డైరెక్టర్**



హైదరాబాద్, సుల్తాన్‌బజార్-న్యూస్‌టుడే: ప్రజారోగ్య శాఖలో బదిలీల వ్యవహారం రసాభాసగా మారింది. సీనియారిటీ జాబితాలను ప్రజారోగ్యశాఖ(పబ్లిక్ హెల్త్) విభాగం తప్పులతడకగా రూపొందించడంతో బదిలీల అంశం గందరగోళంగా మారి.. చివరికి వాయిదా పడింది. రాష్ట్రం నలుమూలల నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్య కళాశాలకు శుక్రవారం ఉదయమే కౌన్సెలింగ్ కోసం తరలివచ్చిన వేల మంది హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు రాత్రి వరకు పడిగాపులు పడ్డారు. చివరికి వాయిదా వేస్తున్నట్లు ప్రజారోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రకటించి చేతులు దులిపేసుకున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టాఫ్‌నర్సులు, హెడ్‌నర్సులు పెద్దసంఖ్యలో ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి.. నిరసన తెలిపారు.

### ఉదయం 9 గంటలకే కౌన్సెలింగ్ ఉంటుందని ప్రకటించడంతో..

వైద్య, ఆరోగ్య శాఖలో ఆరంభం నుంచి బదిలీల అంశం గందరగోళంగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్లు, అంతకంటే ఎక్కువకాలం ఒకేచోట పనిచేస్తున్న హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సుల సీనియారిటీ జాబితాను శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటలకు అధికారులు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు జోన్ల వారీగా కౌన్సెలింగ్ ఉంటుందని ప్రకటించడంతో.. రాష్ట్రం నలుమూలల నుంచి 10 వేల మందికిపైగా స్టాఫ్‌నర్సులు కౌన్సెలింగ్ నిర్వహించే ఉస్మానియా వైద్య కళాశాలకు చేరుకున్నారు. ప్రజారోగ్యశాఖ ఉన్నతాధికారులు రూపొందించిన సీనియారిటీ జాబితాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 33 సంవత్సరాల సీనియారిటీని 13 ఏళ్లుగా చూపడం వంటివి సహా సీనియారిటీ జాబితాలను పూర్తిగా తప్పులతడకగా రూపొందించారని.. వాటిని సవరించిన తర్వాతే బదిలీల కౌన్సెలింగ్ చేపట్టాలని స్టాఫ్‌నర్సులు పట్టుబట్టారు. దీనికితోడు ఉద్యోగ సంఘాల పేరుతో భారీసంఖ్యలో సిఫారసు లేఖలు సమర్పించడంపైనా మండిపడ్డారు. ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ రవీందర్ నాయక్, ఇతర అధికారులను సీనియారిటీ జాబితాలపై నిలదీశారు. వాటిని సవరించాలని కోరుతున్నా స్పందించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ కొనసాగుతుందని, సీనియారిటీ జాబితాలను సవరిస్తామంటూ ఉన్నతాధికారులు పరస్పర విరుద్ధంగా చెప్పడంతో.. కొత్త జాబితాలను రూపొందించిన తర్వాతే కౌన్సెలింగ్ చేపట్టాలంటూ కౌన్సెలింగ్ కేంద్రాల వద్ద బైఠాయించారు. సాయంత్రం ఆరు గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. చివరకు హెడ్ నర్సులకు మాత్రమే కౌన్సెలింగ్ చేస్తామని.. స్టాఫ్‌నర్సులకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రజారోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి వ్యయప్రయాసలకు గురై వస్తే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామంటారా అంటూ ప్రజారోగ్యశాఖ డైరెక్టర్, ఇతర అధికారులను స్టాఫ్‌నర్సులు నిలదీశారు. గత్యంతరం లేక రాత్రి ఏడు గంటల ప్రాంతంలో కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ ప్రకటించారు. దాంతో ఉస్మానియా వైద్య కళాశాల మెయిన్ గేట్ ఎదుట స్టాఫ్‌నర్సులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో కోఠి ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 10 గంటల వరకు ఆందోళన చేపట్టారు. వర్షంలోనూ తమ నిరసన కొనసాగించారు.

### ఆహారం, తిండి లేక ఇబ్బందులు..

కౌన్సెలింగ్ కోసం 200-300 కిలోమీటర్ల దూరం నుంచీ స్టాఫ్‌నర్సులు తరలివచ్చారు. ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ములుగు, నాగర్‌కర్నూల్, నారాయణపేట, ఖమ్మం జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల నుంచి కొందరు రూ.వేల అద్దె చెల్లించి వాహనాల్లో వచ్చారు. కౌన్సెలింగ్ ఎప్పుడు మొదలవుతుందోనని రోజంతా పడిగాపులు కాశారు. స్టాఫ్‌నర్సులతో పాటు వారికి తోడుగా వచ్చిన కుటుంబ సభ్యులు, వేల వాహనాలతో ఉస్మానియా వైద్య కళాశాల ప్రాంతం నిండిపోయింది. ఆహారం, నీళ్లు లేక రోజంతా ఇబ్బంది పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు.

# పాత బస్తీలో నీలకంఠేశ్వర స్వామి ఊరేగింపులో పాల్గొన్న మున్నూరు కాపు మహాసభ సభ్యులు



హైదరాబాద్‌బీ జులై 19(వాయిస్ టుడే) హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ పురానాపూల్ విఠలేశ్వర స్వామి ఊరేగింపులో పాల్గొన్న ఆలయ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ పూర్వ కార్యవర్గ సభ్యులు, హైదరాబాద్ పార్లమెంట్ కాంటెస్టెడ్ ఎంపీ, నాయవాది, పుస్తే శ్రీకాంత్, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు, న్యాయవాది, మణికొండ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు, న్యాయవాది, కొండూరు వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు, మణికొండ రమేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు సప్పిడి శ్రీనివాస్ రావు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## లష్కరు బోనాలు వేడుకలకు రండి

### కెసిఆర్‌కు పద్మారావు గౌడ్ ఆహ్వానం



సికింద్రాబాద్, జూలై 19 (వాయిస్ టుడే ప్రతినిధి): ఈ నెల 21వ తేదిన జరిగే సికింద్రాబాద్ బోనాలు వేడుకల్లో పాల్గొనాలని బీ.ఆర్.ఎస్. అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును సికింద్రాబాద్ శాసనసభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎర్రవల్లి లోని వ్యవసాయ క్షేత్రంలో కెసిఆర్ ను కలిసి ఆహ్వానించారు. సంవత్సరాలుగా సికింద్రాబాద్ బోనాలు వేడుకల్లో పాల్గొని మోండా మార్కెట్ లోని పద్మారావు నివాసంలో విందుకు కెసిఆర్ హాజరు కావడం రివాజుగా వస్తోంది. ఈ క్రమంలో కెసిఆర్ ను పద్మారావు కలిసి బోనాలు వేడుకలకు, తన నివాసంలో విందుకు ఆహ్వానించారు. పద్మారావు గౌడ్ తో పాటు ఆయన కుమారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యార్థులు భవిష్యత్తుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి




### ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి

సికింద్రాబాద్, జూలై 19 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యార్థులు తమ భవిష్యత్తుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి సూచించారు. తమ భవిష్యత్తు మెరుగ్గా ఉండేందుకు సరైన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో తెలంగాణ కామర్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ మీట్ 'వాణిజ్య- 2024 ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం పొందిన వారి సంఖ్యను కామర్స్ యూజీ విద్యార్థుల సంఖ్య మించిపోయిందన్నారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో అందించే యూజీ కోర్సులలో కామర్స్ విభాగానికే ఎక్కువ డిమాండ్ ఉందని చెప్పారు. కామర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ డి. చెన్నప్ప మాట్లాడుతూ ఇటీవలి కాలంలో తమ విభాగంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వాణిజ్య విభాగంలో ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డాక్టర్ రియాజ్, వాణిజ్య 2024 కన్వీనర్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్ ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ కృష్ణచైతన్య, ప్రొఫెసర్ ప్యాట్రిక్, డాక్టర్ సూర్యప్రవీణ్, ఎంవీ నరసింగరావు పాల్గొన్నారు.



## రహమత్ నగర్‌లో అమర్ పాయింట్ హొటల్ ప్రారంభం

జూబ్లీహిల్స్ జూలై 19( వాయిస్ టుడే) జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ లోని అమర్ పాయింట్ హొటల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కార్పొరేటర్లు సి ఎన్.రెడ్డి సంగీత యాదవ్ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇంచార్జ్ నవీన్ యాదవ్ పాల్గొని రిబ్బన్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారికి హొటల్ యజమాని హమీద్ మరియు అజీజ్ వారికి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు

## పాఠశాల, ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మౌనిక వసతులు కల్పించాలి

### ఖానామెట్టులో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేస్తాయాలి: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



శేరిలింగంపల్లి, జులై 19(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం విద్యా కమిటీ సభ్యులు పలు సమస్యలను చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయదుర్గం విద్యా కమిటి సభ్యులు మాట్లాడుతూ రాయదుర్గం లోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి, ప్రభుత్వ డిగ్రీ కళశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రాయదుర్గం ప్రభుత్వ పాఠశాల మరియు జూనియర్ కళశాలలో మౌళికవసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, అభివృద్ధి చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేసుకుంటామని అన్నారు. ఖానామెట్ లో త్వరలోనే డిగ్రీ కాలేజ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, త్వరలోనే పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం విద్యా కమిటీ సభ్యులు కృష్ణా గౌడ్, నరేందర్ ముదిరాజ్, సురేష్, ప్రభాకర్, సుదర్శన్ మరియు తదితరులు పాల్గొన్నారు

## వర్షాలకాలంగా డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి మురుగునీటిని వ్యవస్థను మెరుగుపరచండి

### కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



కూకట్‌పల్లి, జులై 19(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో ఇటీవల వర్షాల కారణంగా గత వారం రోజులుగా వినాయక్ నగర్ లో డ్రైనేజీ మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని డివిజన్ పరిధిలో ప్రతినిత్యం ఎక్కడో ఒకచోట డ్రైనేజీలు పొంగిపోయి రోడలపై ప్రవహిస్తోందని స్థానిక బస్తివాసులు మండిపడుతున్నారు. ఈ విషయమై కాలనీ వాసులు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు వెంటనే స్పందించిన కార్పొరేటర్ బస్తీలు, కాలనీలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని పంచవటి అపార్ట్మెంట్ సెల్లార్ లో డ్రైనేజీ నీరు చెత్త చదారంతో నిండిపోయిందన్నారు. సంభందిత అధికారులతో మాట్లాడి వెంటనే డ్రైనేజీ లైన్ క్లియర్ చేయాలని అధికారులకు తెలిపారు. సంబందిత అధికారులు సంఘట స్థలానికి తమ సిబ్బందితో చేరుకుని పనులు ప్రారంభించారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీ, బస్తీల్లో వర్షాకాలంలో ఏర్పడుతున్న సమస్యలు ఏర్పడా ప్రజలుకు అందుబాటులో ఉండి తక్షణ పరిష్కారం అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం కార్పొరేటర్ అధికారులకు సూచిస్తూ ఎల్లప్పుడు వర్షం వచ్చిన ప్రతిసారి పంచవటి వాసులు నరకం చూడాల్సి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి ఏఈ మహమ్మద్ రషీద్, వాటర్ వర్స్ డీజీఎం షంషీర్, సెక్షన్ మేనేజర్ అనిల్, జీహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రాములు తోపాటు స్థానికులు ఎన్వీ రత్నం, సురేంద్ర యాదవ్, కాలనీ అధ్యక్షుడు సిద్ధి రాములు, మహేష్, శివ, గంగోలి చంద్రశేఖర్, శ్రీనివాస రావు మరియు వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## చదువులే కాకుండా సంస్కృతి సంప్రదాయాల పట్ల కూడా అవగాహన కల్పిస్తుంది ఆ పాఠశాల ప్రతి పండగ




ప్రాశస్త్యం ,దాని వైభవం, గొప్పతనం, ఆచరించే విధానాలను విద్యార్థులకు విడమరిచి చెబుతోంది.హైదరాబాద్ ఎస్.ఆర్ నగర్ లోని గీతాంజలి ఒలంపియాడ్ పాఠశాల జంట నగరాల్లో జరుగుతున్న ఆషాడ మాస బోనాల పండగపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించింది.చైర్మన్ పుట్టి శ్రీనివాస్ నేతృత్వంలో పాఠశాల సిబ్బంది బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల విశిష్టత ను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ప్రవీణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి ని వివరించడం వల్ల వారిలో సమాజం పట్ల అవగాహన కలుగుతుందన్నారు.విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల లో బోనాల వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

## మొక్కలు నాటిన బోరబండ కార్పొరేటర్ బాబా పసియుద్దీన్



జూబ్లీహిల్స్ జులై 19 (వాయిస్ టుడే) బోరబండ సైట్ టు వాటర్ వర్క్స్ కార్యాలయం రిజర్వాయర్ వద్ద లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాన మహోత్సవ కార్యక్రమం బోరబండ కార్పొరేటర్ మొక్కలు నాటడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యాత్మక కాలనీలలో లైన్మెన్‌తో కలిసి తిరిగిన మాజీ మేయర్



బండ్లగూడ జాగీర్ ,19 జులై (వాయిస్ టుడే ): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22 వ వార్డులో గల పలు కాలనీలలో విద్యుత్ సమస్యలు తలెత్తడంతో మాజీ మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ శుక్రవారం విద్యుత్ ఏఈ కి చరావాణి లో మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరారు.స్పందించిన ఏఈ లైన్ మాన్ ను క్షేత్రస్థాయికి పంపించి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ లైన్ మాన్ ప్రసాద్ తో కలసి యాదవ్ మిత్ర కాలనీ,భారతి నగర్,వినాయక్ నగర్ కాలనీ,గాయత్రినగర్,ఆదర్శ్ నగర్ కాలనీలలో పర్యటించి తీవ్ర స్థాయిలో ఉన్న సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ లైన్మెన్ మాట్లాడుతూ ప్రజలు, కాలనీవాసులు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ స్తంభాలకు, ఇతర వైర్లకు కానీ, విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మలకు పట్టుకోవద్దని తెలిపారు.

## రాత్రిళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న ఇరువురి అరెస్టు



సికింద్రాబాద్, జూలై 19 (వాయిస్ టుడే ప్రతినిధి): రాత్రిళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. ఓయూ పోలీస్ స్టేషన్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ రాజేందర్ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం హబ్సిగూడ రవీంద్రనగర్లో నివాసముండే వనితారెడ్డి ఇంట్లో బి. సులోచన పనిలో చేరింది. ఆ ఇంటిలోనే ఒక గదిని సులోచనకు కేటాయించారు. ఆ గదిలోని అల్మారాలో ఆమె తన బట్టలు, నగదు, బంగారంతో పాటు తన వస్తువులను జాగ్రత చేసుకుంది. గత నెల 26న ఉదయం అయిదున్నర గంటలకు ఇంట్లో పనికోసం వనితారెడ్డి ఇంట్లోకి వెళ్లింది. తిరిగి వచ్చిన సులోచన తన గది తలుపు తెరిచి ఉండడంతో పాటు సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించింది. అల్మారాలోని 4.5 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.20 వేల నగదు కనిపించకపోవడంతో ఆమె వెంటనే తన యజమానికి సమాచారం అందించింది. ఎవరో తన గదిలోకి ప్రవేశించి చోరీ చేసి ఉంటారని భావించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిని విచారణ జరుపుతున్న పోలీసులు విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు తార్నాక చౌరస్తాలో గురువారం ఉదయం పొటేల్ రమేశ్ అలియాస్ పటేల్ (35), యూసుఫ్ బీ (30)లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక ద్విచక్రవాహనం. నాలుగున్నర తులాల బంగారం, 45 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. రమేశ్ పై 2013 నుంచి ఇప్పటి వరకు 34 చోరీ కేసులు పెండింగ్ ఉన్నాయన్నారు.

## పార్టీ సభ్యత్వం పొందిన జనసైనికులకు ఎల్లవేళలా అండగా నిలుస్తాం

### జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్



కూకట్‌పల్లి, జులై 19(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ 4వ విడత క్రియాశీలక సభ్యత్వం నమోదు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ శుక్రవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రారంభమైన నూతన రెన్యువల్ సభ్యత్వ క్రమంలో భాగంగా కెపిహెచ్బీ కాలనీ 5వ ఫేస్ లో గల జనసేన పార్టీ కార్యాలయంలో కూకట్ పల్లి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మొదటగా తన సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వం కార్యకర్తలకు అండగా నిలబడే మనో ధైర్యం ఉందని, కార్యకర్తకు ప్రమాదవశాత్తు కష్టం వచ్చినా వచ్చినప్పుడు వారి కుటుంబాలను జనసేన పార్టీ ద్వార ఆదుకోవడమే తమ తత్వమని తెలిపారు. ఇందుకు సభ్యత్వ నమోదు లక్ష్యమని, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ భావాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్తే నమోదు కార్యక్రమని, జనసేన పార్టీకి ప్రజలకు వారధి లాగా ఉంటుందని, ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలని, జనసేన నాయకులు, వీర మహిళలు ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం కావా ని అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.



## సంబరాలలో అన్నదాతలు

### సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే శంకర్‌ల చిత్ర పటలకు పాలాభిషేకం

వాయిస్ టుడే /షాద్ నగర్ /జులై 19బీ రైతు సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో పథకాలు అమలు చేస్తున్న రైతు బాంధవుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనీ నందిగామ మండలం మొదల్ల గూడ గ్రామ కాంగ్రెస్ నాయకులు రైతులు అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేయడం పట్ల గ్రామాల్లో హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. రుణమాఫీ రైతుల ఖాతాలలో జమ చేయడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర చరిత్రలో రాష్ట్ర చరిత్రలో చెరగని అధ్యాయం, రాజశేఖర్ రెడ్డిని మరిపిస్తూ, ఉన్నటువంటి 70 లక్షల రైతుల కుటుంబాల వెలుగులు నింపుతూ, సుమారుగా 33 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసి రైతు బంధువుగా మారిన మన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికీ తెలంగాణ రైతులందరికి ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. చేసి చూపించింది కాంగ్రెస్ సర్కార్. మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలంగాణ యావత్ రైతాంగానికి రుణపడి ఉంటారు. రుణమాఫీకి శ్రీకారం చుట్టారని కాంగ్రెస్ కార్యకర్తలు వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమం సీకుర్తి సుదర్శన్ ఆద్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో శేఖర్ రెడ్డి, అశోక్ రెడ్డి, నరసింహులు, జంగయ్య, శ్రీపతి రెడ్డి, రాజలింగం గౌడ్, యాదిరెడ్డి, ముస్తఫా, ఈశ్వరయ్య, శంకరయ్య, ఆంజనేయులు గౌడ్, నరేందర్ రెడ్డి, వెంకటేష్, రాజు, వెంకటేశ్వర,విజయ్, సిద్దేశ్వర్, శ్రీధర్, మహేందర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

### మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్. .....

వాయిస్ టుడే /షాద్ నగర్ /జులై 19బీ పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చని వ్యాధులను దూరం చేయవచ్చని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు.షాద్ నగర్ మున్సిపాలిటీలోని 24వ వార్డులో సందర్శించి పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పై స్థానికులకు అవగాహన కల్పించారు. నల్ల గుంతలలో, రోడ్లపై నిల్వ ఉన్న నీటిని పారబోయించారు.మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు.వ్యర్థపదార్థాలు ఎక్కడ పడితే అక్కడ కాలువల్లో వేయకుండా చెత్తబుట్టలలో వేయాలన్నారు. ఇంట్లో తడి పొడి చెత్తను ఆరుబయట ఖాళీ ప్రదేశాలలో పారవేయడం వలన దోమలు అధికంగా అవుతాయి. ప్రతి ఒక్కరూ ఇంట్లో చెత్తను చెత్త సేకరణ వాహనంలోనే వేయాలని కోరారు. రోడ్లకి ఇరువైపులా ఉన్నటువంటి పిచ్చి మొక్కలను శుభ్రం చేయించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్,మున్సిపల్ సిబ్బంది సాయిబాబా, రమేష్,జవాన్ మల్లేష్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు....



## పదోన్నతి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్

వాయిస్ టుడే /షాద్ నగర్ /జులై 19: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా ఫరూఖ్ నగర్ మండలం కడియాలకుంట తండా గ్రామంలో గత ఆరు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి నేడు పదోన్నతి పొందిన అరుంధతి మరియు 13 సంవత్సరాలు గ్రామ ప్రాథమిక పాఠశాల కు సేవలందించిన సత్యం కు గ్రామ సేవాలాల్ యూత్ అసోసియేషన్ మరియు మాజీ సర్పంచ్ బుజ్జి రాజు నాయక్.వైస్ ఎంపీపీ మౌనిక హరికృష్ణ గౌడ్ మాజీ ఎస్ఎంసి చైర్మన్ తావుసింగ్ నాయక్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకర్ నూతనంగా వచ్చిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ హాజరై మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తమ గ్రామంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల సేవలు వెలకట్ట లేవని అని కొనియాడారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు మరియు పాఠశాలకు అభివృద్ధికి వారు చేసిన సేవలు చిరస్థాయిగా గ్రామ విద్యార్థుల ప్రజలలో ఉంటాయన్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేసే వారికి బదిలీలు పదోన్నతులు సహజమని ఆయన అన్నారు. పదోన్నతి మరియు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు విద్యార్థులు కలిసి పెద్ద ఎత్తున సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్ గ్రామ సేవాలాల్ యువజన సంఘం నాయకులు రమేష్ రాజు వినోద్ నరేందర్ రమేష్ అంగన్వాడి సుజాత గ్రామపంచాయతీ కార్మికులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలి

### భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.శుక్రవారం నాడు ఆయన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలుతో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతు కె జండగే సమన్వయం తో కలెక్టరేట్ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 22 నుండి పార్లమెంట్ మొట్టమొదటి బడ్జెట్ సమావేశాలుమొదలవుతున్నందున పార్లమెంట్ సభ్యుడినైన నా నుండి ప్రజలు ఎన్నో ఆశిస్తారని, వారి అంచనాలకు అనుగుణంగా ప్రశ్నోత్తరాల సమయంలో జిల్లా ప్రజల సమస్యలపై వివరించడానికి ఇలాంటి సమీక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికి అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇన్ పుట్ అందించి అందుకు అనుగుణంగా అభివృద్ధి నిధులు పొందాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 31 వేల కోట్లతో ఆగష్టు చివరిలోపు 2 లక్షల రైతు రుణ మాఫీ చేసి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నారని అన్నారు. రైల్వే శాఖ గురించి మాట్లాడుతూ జనగాం యాదాద్రి స్టేషన్ పనుల నిధులు శాంక్షన్ అయ్యాయని, జనగాం స్టేషన్ 50 శాతం, యాదాద్రి స్టేషన్ 20 శాతం పనులు కావడం జరిగిందని, డిసెంబరు చివరి లోగా అన్ని పనులు పూర్తి అయ్యేలా రైల్వే అధికారులు పూనుకోవాలని తెలిపారు. ప్రతి రోజూ ఇతర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగుల కోసం భువనగిరి, ఆలేరు, జనగాం స్టేషన్లలో రైళ్లు ఆగేలా, పుష్ పుల్ రైల్ భువనగిరి లో ఆగేలా, అలాగే ఇంటర్ స్టేట్ రైల్ సర్వీసులు ఆగేలా కృషి చేస్తానని తెలిపారు. ఆలేరు పెద్దవాగు అండర్ పాస్ రోడ్ విస్తరణ అవసరమున్నందున రైల్వే శాఖ దృష్టికి తెస్తామని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీస్ పై మాట్లాడుతూ చిట్యాల-భువనగిరి రోడ్డు విస్తరణ కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చి అనుమతులు సాధిస్తామని తెలిపారు. భువనగిరి ఎయిమ్స్ ఆసుపత్రి పై మాట్లాడుతూ ప్రతి రోజూ 2500 మందికి పైగా ఔట్ పేషెంట్లకు సేవలందిస్తున్నందున వారికి సరైన క్వాలిటీ సేవలు అందించాలని, ఎయిమ్స్ ఉన్న తరువాత ఎవ్వరూ కూడా హైదరాబాదు వెళ్లని విధంగా సేవలు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఎయిమ్స్ వద్ద బస్సులు ఆగే విధంగా బస్సు స్టాప్స్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. భువనగిరి కోట క్రింద నుండి కోట పైవరకు మొదటి ప్యాకేజీ కింద శాంక్షన్ అయిన 56 కోట్లతో టెండర్ పనులు ప్రారంభించాలని తెలిపారు. నిరుద్యోగులకు సరైన ఉపాధి అవకాశాలు కలిగేలా స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ నైపుణ్య శిక్షణను పెంచాలని, ఏ రంగంలో శిక్షణకు ఆసక్తి కనబరుస్తారో గమనించాలని, డిమాండ్ ఉన్న కోర్సుల పట్ల శిక్షణ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని తెలిపారు. త్రాగునీరు సంబంధించి జల్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి గ్రామం, అవాసంలో త్రాగునీరు అందించాలని తెలిపారు.సమగ్ర శిశు పథకం క్రింద నడుస్తున్న అంగన్వాడీలకు స్వంత భవనాలు లేని వివరాలను అందించాలని, భవనాల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణాభివృద్ధి సంస్థ గురించి మాట్లాడుతూ ఉపాధి పనులలో అరులైన వారికి పని కల్పించాలని, అలాగే గ్రామాలలో చెరువుల పూడికతీత, ఫారం పాండ్స్, కాలువలలో పూడికతీత, చేపల చెరువులు,పండ్ల తోటల పెంపకం, వ్యక్తిగత భూములలో భూమి అభివృద్ది పనులు, కందకాల పనులు చేపట్టాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమల పట్ల నిబంధనలు కఠినంగా అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి ఎం.ఎ. కృష్ణన్, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సగం రుణమాఫీతో ఆర్భాటపు సంబరాలు

### రైతు బంధు నిధులు రుణ మాఫీకి మళ్లింపు

### మోసానికి మరోపేరు కాంగ్రెస్



సూర్యాపేట/ కోదాడ: జులై 19 (వాయిస్ టుడే ప్రతినిధి) ఎన్నికల ముందు రైతాంగానికి,ఒకేసారి రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బందు ఎగ్గొట్టి, ఆ నిధులలో ఆరు వేల కోట్లతో కొందరు రైతులకుమాత్రమే ఒక లక్ష రుణ మాఫీ చేసి సంబరాలు జరపడం రైతులను మోసాగించడమే అవుతుందని తెలుగు రైతు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణ మాఫీపై రైతాంగాన్ని మభ్య పెడుతున్నదని చెప్పారు. ఆరు వేల కోట్లతో రైతులందరికీ రుణ మాఫీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. యాసంగి రైతుబంధులోనే రైతులకు రెండు వేల కోట్లు ఎగ్గొట్టి వానాకాలం రైతుబంధు గురించి కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడటం లేదని అన్నారు. రైతులకు ఎకరాకు 7,500 రూ.ల చొప్పున 10వేల కోట్లు ఎగ్గొట్టారని అన్నారు. ఒక కోటి డెభై మూడు లక్షల మంది మహిళలకు 2,500 రూ.ల చొప్పున ఈ ప్రభుత్వం బాకీ పడింది. కౌలు రైతులకు ఇస్తామన్న రైతుబంధు క్కూడా ఈ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే సమయములో రైతు బందు, రైతు రుణ మాఫీ, రైతు బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు నెలకు రెండు వేల చొప్పున, నిరుద్యోగులకు నాలుగు వేల చొప్పున, భూమి లేని కౌలు రైతులకు పదిహేను వేల చొప్పున 6,240 కోట్లు ఇవ్వాలని, వరి ధాన్యంపై 6,500 కోట్ల బోనస్ ఎగ్గొట్టి కేవలం ఆరు వేల కోట్లతో ఒక లక్ష ఋణ మాఫీ చేసి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకున్నదని విమర్శించారు. కాంగ్రెస్ మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా అఖిలపక్ష రైతు సంఘాలను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెంకటేశ్వరావు తెలిపారు.



## మరమత్తులు చేయకుండా బొంగకు కంప వేశారు

### సాగర్ నీళ్ళు విడుదల చేశారు

కోదాడ/నడిగూడెం, జూలై 19(వాయిస్ టుడే ప్రతినిధి). నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువకు 120 వ కిలోమీటర్ల వద్ద రామాపురం ఊర చెరువు, సమీపంలో సాగర్ ప్రధాన కాలువకు బుంగ పడి నెలలు గడుస్తున్నా , అధికారులు ప్రతిపాదనలు పంపినా, రాష్ట్రపాలకులు నేటికీ,నిధులు మంజూరు చేయక మరమ్మతులు చేపట్టక, బొంగకు కంపవేసి, పాదచారులకు, వాహనదారులకు వచ్చి పోయే వారికి, ప్రమాదాలు జరగకుండా,చేతులు దులుపుకున్నారు. త్రాగునీటి కోసం ఖమ్మం జిల్లాపాలేరు రిజర్వాయర్కు ,సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పొలాలకు పొట్ట దశలో ఉన్న సమయంలో బొంగబడిన చోట కాలువ కట్టకు ప్రమాదం ముంచుకొస్తుందనే, ఆందోళనతో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బొంగ పడిన చోట చోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని ,రైతులు రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.



## బర్రెలను కోల్పోయిన పేద రైతును ఆదుకోవాలి

### :- పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- శీవిద్యుత్ షాక్ వల్ల మూడు బర్రెలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయిన పేద రైతు కట్ల యాదగిరిని ఆదుకోవాలని అధికారులు ప్రజాప్రతినిధులతో మాట్లాడి వారికి న్యాయం జరిగే విధంగా చూస్తామని పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ అన్నారు. గురువారంరోజు బోనగిరి పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ బాహర్ పేట సమీపంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల చనిపోయిన బర్రెలను సంఘటన జరిగిన ప్రాంతంలో రైతు కట్ల యాదగిరి తో కలిసి పరిశీలించి రైతును పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బర్ల యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీని కార్యక్రమం విజయవంతం చేయాలని కరపత్రం విడుదల

**బిసి విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్**

**బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని బీసీలు అధిక సంఖ్యలో రావాలి**



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- వచ్చే నెల ఆగస్టు 5,6న జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భువనగిరిలోని కాలేజీలు హాస్టల్స్ విజిట్ చేసి అనంతరం ఉమెన్స్ కాలేజ్ వద్ద విద్యార్థులతో కలిసి కరపత్రం బిసి విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమానికి లక్షలాదిమందిగా తరలిరావాలని చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అలాగే ఎస్సీ ఎస్టీ బీసీ, బీసీ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రుత్వ శాఖ ఏర్పాటు చేయాలని జనాభా గణనలో బీసీ కుల గణన చేయాలని దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని గవర్నమెంట్ సంస్థలో ప్రైవేటీకరణ నిషేధించాలని బీసీ క్రిమిలేయర్ ను ఎత్తివేయాలని ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తింపజేయాలని, బడ్జెట్లో బీసీలకు 5లక్షల కోట్లు కేటాయించాలని బీసీలంట్లే కేవలం ఓట్లు వేసే యంత్రాలుగనే చూస్తున్నాయి ఈ ప్రభుత్వాలు దేశ గవర్నమెంట్ ఉద్యోగాలలో బీసీలు 7 శాతం గిట్ల లేకపోవడం సిగ్గుచేటు రాజకీయంగా 12 శాతం దాటలేదు బీసీలు రాష్ట్ర ప్రభుత్వం ఏమో బీసీలకు స్థానిక సంస్థల 42% రిజర్వేషన్ అని చెప్పి దాన్ని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు.బీసీల కోసం ఢిల్లీలో ధర్నా చేస్తాం బీసీ బిల్లుకు మద్దతు అని చెప్పి ఇంతవరకు దాని ఊసే లేదు బీసీ బిల్లుకు మద్దతు తెలపకపోతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు వట్టెం మధు,చిన్నం సాగర్,పబ్బాల ఎలీషా, మనీషా రెడ్డి, శాలిని నాయక్,మాధురి,సంగీత,మౌనిక గౌడ్,వసుందరి,ప్రత్యూష,మానస, సునీత తదితరులు పాల్గొన్నారు.



## అభ్యర్థుల లిస్టును ప్రాథమికంగా ఆన్లైన్ చేశాము

### జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 19 ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య కళాశాలలో నోటిఫికేషన్ ఇవ్వబడిన 155 పోస్టులకు సంబంధించి దరఖాస్తు చపేకదంతం అభ్యర్థుల లిస్ట్ ను ప్రాథమికం గా ఆన్లైన్ చేసి జిల్లా అధికారిక వెబ్సైట్ http://kothagudem.telangana.gov.inలో పొందుపరిచినట్లుగా జిల్లా ఉపాధి కల్పన అధికారిని వేల్పుల విజేత ఒక ప్రకటనలో తెలియచేశారు. కావున దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అట్టి లిస్టును చూసుకొని వారి అర్హత మార్కుల విషయంలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే (15) రోజుల్లోగా అనగా 05.08.2024 లోగా వారి యొక్క అభ్యంతరాలను జిల్లా ఉపాధి కల్పనా అధికారి వారి కార్యాలయంలో లిఖితపూర్వకంగా తగిన ఆధారాలతో అభ్యంతరాలు తెలుపగలరని తెలియజేసినారు. సంబంధిత రంగం లోని క్వాలిఫికేషన్ , అనుభవం తదితర పత్రాలను ఒకసారి సరిచూసుకుని (15) రోజుల లోగా అన్ని అభ్యంతరాలను నివృత్తి చేసి , సర్టిఫికెట్లు వెరిఫై చేసిన పిదప ఫైనల్ మెరిట్ లిస్టును తయారు చేస్తామని జిల్లా ఉపాధి కల్పనా అధికారిని శ్వేల్పుల విజేత ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ప్రతి పల్లెకు పక్కా రహదారుల నిర్మాణానికి కృషి

**కనీస మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత**

**రూ.4కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన**

**జోరువాన లోనూ ఉల్లాసంగా శంకుస్థాపన కార్యక్రమాలు**

**లక్ష్మీదేవిపల్లి ఏజెన్సీ గ్రామాల్లో అధికారులను పరుగెత్తించిన ఎమ్మెల్యే**



భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే : మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించి, గ్రామీణులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నానని, కొద్ది రోజుల్లోనే రహదారుల సమస్య లేని గ్రామాలు ఆవిష్కృతం అవుతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మిదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్ల గ్రామ శివారులో రూ.3.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న హైలెవల్ వంతెన నిర్మాణం, లోతువాగు-మాదిగపొలు గ్రామాల మధ్య రూ.12.00లక్షల వ్యయంతో నిర్మించనున్న చప్టా నిర్మాణానికి, రూ.25.00లక్షల వ్యయంతో నిర్మించనున్న పెద్దతండా-మన్యతాండా కాజ్ వే నిర్మాణానికి అదేవిధంగా హేమచంద్రాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.13.50లక్షల వ్యయంతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్ భవనానికి శుక్రవారం కూనంనేని శంకుస్థాపన చేశారు. జోరువానను సైతం లెక్క చేయకుండా కూనంనేని శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన శంకుస్థాపన సభల్లో కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇప్పటికే ఎన్ఆర్ఈజిఎస్, డిఏంఎఫ్టి, సిఎస్ఆర్ పథకాలు, వివిధ గ్రాంట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంగంతా జరుతుతున్నాయని, త్వరలోనే గెలుపు ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ సమగ్రాభిరుద్దికి కట్టుబడి పనిచేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, పిఎసియస్ డైరెక్టర్, సీపీఐ మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఎమ్.వసంతక్క, జగన్మోహన్ రావు, ధర్మరాజు, బోయిన విజయకుమార్, గోవిందు, కుంజా రాంబాబు, ఏఈ మోహన్, డీఈ రామకృష్ణ, ఈఈ వెంకటేశ్వర్లు, ఎంపిడివో చలపతిరావు, తహసీల్దార్ కే ఆర్ కే ప్రసాద్, ఎమ్ఈవో జుంకిలాల్, ఏఈ రఘురాం, హెచ్ఎం శ్రీనివాసరావు, స్థానిక నాయకులు దీటి లక్ష్మీపతి, ధనుంజయ్, జలీల్ పాషా, కోడి లింగయ్య, కంటెం శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, అర్జున్ రావు, పూర్ణయ్య, బైకానీ కృష్ణ, ఉపేందర్,తరాల రాజు, అమర్ సింగ్, ఉదయ్ కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనలో పోలీసు, ఎక్సైజ్ శాఖలు జట్టుగా కలిసి పని చేయాలి: జిల్లా ఎస్పి

- డ్రగ్స్‌తో సామాజిక భద్రతకు భంగం ప్రజా సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- గంజాయి కేసుల్లో ఉన్న పాత నేరాస్తులపై నిఘా పెంచాలి
- డ్రగ్స్ నిర్మూలనలో పౌరులను, ఉద్యోగులను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి
- మహిళ సంభంద, పొక్సో కేసుల్లో ప్రణాళిక ప్రకారం పని చేయాలి
- కొత్త న్యాయ చట్టాలపై నైపుణ్యం సాధించాలి

**పోలీసు అధికారుల సమీక్షా సమావేశం నందు అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్**



సూర్యాపేట, జూలై 19(వాయిస్ టుడే ప్రతినిధి.): సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లా పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులతో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్ధన్ రెడ్డి, ఎక్సైజ్ సూపింటెండెంట్ లక్ష్మా నాయక్, DSPలు రవి, శ్రీధర్ రెడ్డి, మట్టయ్య, శ్రీనివాస రావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, ఎక్సైజ్ ఇనస్పెక్టర్‌లు, SI పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సమాజంలో ప్రస్తుతం డ్రగ్స్, గంజాయి చాలా ప్రధాన సమస్యగా ఉన్నది, దీని యొక్క మూలాలను తొలగించి నిర్మూలించడం ప్రధానమైనది అన్నారు. డ్రగ్స్ పౌరుల సమాజిక, ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రమాదకరమైనది, డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం, గౌరవ సీఎం డీజీపీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు అన్నారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో టీమ్ వర్క్ చేయాలి, గంజాయి పై సమాచారాన్ని, ఇంటలిజెన్స్ ను, నేరస్తుల సమాచారాన్ని ఇరు శాఖలు పరస్పరం చెరవేసుకుని గంజాయి నిర్మూలనకు పని చేయాలని కోరారు. మన జిల్లాలో ఇప్పటివరకు డ్రగ్స్ విషయంలో గంజాయి ఎక్కువ మొత్తంలో సీజ్ చేశాము, గంజాయి రవాణా చేసే వారిని, వినియోగించే వారిని, అమ్మకాలు చేసే వారిపై కేసు నమోదు చేయడం చేశాం అన్నారు. గంజాయి సంభంద కేసులో ఉన్న నిందితులు, నేరస్తులపై ఎక్కువగా నిఘా ఉంచాలి, పాత నెరస్తులపై, నిందితులపై షీట్స్ నమోదు చేయాలి, అలవాటుగా అదే నేరానికి పాల్పడితే PD యాక్ట్ నమోదు చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి నెల మూడవ బుధవారం రోజున యాంటీ డ్రగ్స్ డేగా ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నాం అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో పౌరులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు.

అనంతరం కేసుల నమోదు, పెండింగ్ కేసుల రికార్డ్స్ పరిశీలించారు. కొత్త న్యాయ చట్టాలపై నైపుణ్యం సాధించాలి కేసుల నమోదులో అవసరమైతే CID ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సహాయం తీసుకోవాలని అన్నారు. షీటర్స్ యొక్క కదలికలు ఎప్పటికప్పుడు పక్కగా తనిఖీ చేయాలని అన్నారు. కేసుల్లో నేర అభియోగ పత్రాలను సకాలంలో కోర్టులకు అందించాలి అన్నారు. మహిళా సభండిత కేసుల్లో, పోక్సో కేసుల్లో దర్యాప్తు ప్రణాళికతో చేయాలి. సిసి కెమెరాలు అధునికరించాలి అని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులపై, డయల్ 100 పిర్యాదులపై త్వరగా స్పందించాలి, సైబర్ మోసాల పట్ల ప్రజలను అవగాహన కల్పించాలి. ప్రజలతో, స్థానిక యువతతో మంచి సంభందాలు కొనసాగించాలి ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం వచ్చేలా సమాచార వనరులను బలోపేతం చేసుకోవాలి, సోషల్ మీడియాను లో ఎలాంటి వాటిపై పోస్టింగ్ లు పెడుతున్నారు, అసత్యాలు, రూమర్స్ ప్రచారం చేస్తున్నారు అనేదానిపై కూడా నిఘా ఉంచాలి అని ఆదేశించారు. కొత్త వ్యక్తుల కదలికలు గమనించాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి, జాతీయ రహదారి 65 వెంట ఉన్న గ్రామాల ప్రజల్లో రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించాలి అన్నారు.

# ప్రజాపాలనలో రైతన్నకు మాట ఇచ్చాం నిలబెట్టుకున్నాం..

**రైతు రుణమాఫీ చరిత్రాత్మక ఘట్టం**

**వ్యవసాయాన్ని పండగ చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం**

**మాజీ మంత్రి,సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి..**



సూర్యాపేట, జూలై 19(వాయిస్ టుడే ప్రతినిధి). నియోజకవర్గంలో ని ఆత్మకూర్ ఎస్ మండలంలో పాతర్లపహాడ్ గ్రామంలో శుక్రవారం రైతులతో రుణమాఫీ సంబరాలలో పాల్గొన్న మాజీమంత్రి,సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి,ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారంగా ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ అమలు చేయడం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన కార్యక్రమం అని మాజీమంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతకాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం ఒకేసారి రెండు లక్షలు రుణమాఫీ అమలు చేస్తున్నదని తెలిపారు.2014లో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ ధనిక రాష్టంలో రుణమాఫీని ఏడాదికి 25వేల చొప్పున నాలుగు విడతలుగా లక్ష రూపాయలు మాత్రమే అమలు చేసిందన్నారు. 2018లో మరో సారి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ ఐదేండ్లు అధికారంలో ఉన్నప్పటికీ రుణమాఫీ అమలు చేయలేదన్నారు.ధనిక రాష్ట్రాన్ని బిఆర్ఎస్ చేతిలో పెట్టినప్పటికీ రుణమాఫీని అమలు చేయడంలో వైఫల్యం చెందిన గత పాలకులు కాంగ్రెస్ అమలు చేస్తున్న రుణమాఫీపై అవాక్కులు చెవాక్కులు పేల్చడం,అభాండాలు మోపే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు.ఆగస్టు 15లోగా మిగతా లక్ష రూపాయలు రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో తమ ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు.రూ.7 లక్షల కోట్లు అప్పులు ఉన్న ఈ రాష్ట్రంలో ఒకేసారి రూ.రెండు లక్షలు రుణమాఫీ చేయడం ఆర్థిక భారం అయినప్పటికీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనం అన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.తెలుపు రేషన్ కార్డు ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ అమలు చేస్తారని బిఆర్ఎస్,బిజెపి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకానికి ఇప్పటివరకు రూ.635 కోట్ల 52 లక్షలు విద్యుత్ సంస్థలకు చెల్లించిందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం వల్ల ఏడు నెలల కాలంలో 40 లక్షల మందికి లబ్ధి చేకూరిందన్నారు.ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కి రూ.280 కోట్లు చెల్లించినట్లు చెప్పారు.రైతు రుణమాఫీని పండుగ వాతావరణంలో నిర్వహించుకుందామని వెల్లడించారు. రైతులకు రుణమాఫీ చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులకు మాజీమంత్రి వర్యులు,సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి,కాకి కృపాకర్ రెడ్డి,గోదాల రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**ఐటీడీఏ పీవో బి.రాహుల్**

భద్రాచలం, జూలై 19 (వాయిస్ టుడే) ఆదివాసి గిరిజన మహిళలు వారి సంస్కృతి సాంప్రదాయాలు ఆధారం గా ఆర్థికంగా బలోపేతం కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. వివిధ కళాకృతులు, పౌష్టికరమైన తినుబండారాలు తయారు చేసి , వాటిని అమ్మకాలు జరిపి లాభాలు ఆర్జించాలని ఆయన సూచించారు. శుక్రవారం ఐటిడిఏ ఆవరణ లోని గిరిజన భవనంలో ట్రై ఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ కళాకృతుల స్టాళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన వివిధ కళాకృతులు భద్రాచలానికి వీఐపీలు సందర్శించినప్పుడే ఇవ్వడం జరుగుతుందని, అలా కాకుండా వీరు తయారు చేసిన ప్రతి వస్తువు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా మార్కెటింగ్ చేయడం వలన ఈ మహిళలు ఆర్థికంగా బలపడడమే కాక ఆదివాసీల సాంస్కృతి సాంప్రదాయాలు పేరు ప్రతిష్టలు అన్ని రాష్ట్రాలకు విస్తరిస్తుందని అన్నారు. త్వరలో ఈ మ్యూజియంలో తయారు చేసిన వస్తువులు మరియు వివిధ గిరిజన తెగలు తయారుచేసిన వస్తువులను సేకరించి తెలంగాణ సెక్రటేరియట్ విఐపి లకు పంపించి వీరి యొక్క సాంప్రదాయాన్ని అందరికీ తెలిసేలా చేయాలని ఆయన అన్నారు. ప్రస్తుతం వీరు తయారు చేసిన ఇతర వస్తువులను ట్రై ఫీడ్ సంస్థ వారు జాగ్రత్తగా పరిశీలించి వాటికి సరియైన ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని, మునుముందు ఇంకా వేరే రకమైన వస్తువులు తయారు చేయడానికి వీరికి ప్రత్యేకంగా శిక్షణ అందించాలని అన్నారు. ఆదివాసి గిరిజన మహిళలు మీలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ఈ సంస్థ వారు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం అవడమే కాక పదిమందికి ఉపాధి కల్పించడానికి తోడ్పాటు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జనరల్ డేవిడ్ రాజ్, ట్రై ఫీడ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ శంక, విశ్వ సురేష్ బాబు, డి ఎం జిసిసి దావూద్ తదితరులు పాల్గొన్నారు.



# బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

రాయికల్:వాయిస్ టుడే రాయికల్ మండలం లోని రామాజి పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి, పదోన్నతి,బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల కు బుధవారం పాఠశాల పక్షాన ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గజ్జెల నరేందర్ అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథులు గా గ్రామ మాజీ సర్పంచ్ లు బెజ్జంకి మోహన్,వాసరి రవి యాదవ్, ఎస్.ఎం.సి మాజీ చైర్మన్ కటుకం రమేష్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీ సహజమని బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు రామాజి పేట్ పాఠశాలకు ఎనలేని సేవలు చేసారని,మంచి ఫలితాలు తీసుకవచ్చారని అందరు గర్వించే మంచి దేశభక్తి, జాతీయ భావాలు కలిగిన విద్యార్థులను తయారు చేసారని అన్నారు. గ్రామస్తుడిగా పాఠశాల హిందీ పండితుడిగా,సామాజిక కార్యకర్త గా పని చేసిన స్వామి యాదవ్ చేసిన సేవలు మరువలేనివని,ఉత్తేజం నిర్వహణలో సేవాకార్యక్రమాలు నిర్వహించడంలో ప్రత్యేకమైన పాత్ర పోషించారని అన్నారు. అనంతరం పదోన్నతి,బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులైన వేల్పుల స్వామి యాదవ్,వల్వోజు శ్రీనివాస చారీ,తంగళ్ళపెల్లి సతీష్,అంజుంబేగం లను శాలువాలతో సత్కరించి మెమొంటో,పుష్పగుచ్చాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తెనుగు రమేష్,లక్ష్మీ కాంతం,ప్రతాప్ రెడ్డి, మైస శేఖర్,బూసి రమ, జ్యోతి,యశోద,పూర్వ విద్యార్థులు,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కిన్నెరసాని ప్రాజెక్టును సందర్శించి,పరిసర లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే 19) గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కిన్నెరసాని రిజర్వాయర్ లోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో అక్కడ ప్రస్తుత పరిస్థితిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు.అక్కడ ఉన్న అధికారులను ప్రాజెక్ట్ ఇన్ ఫ్లో,అవుట్ ఫ్లో,స్టోరేజ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కిన్నెరసాని నది పరివాహక లోతట్టు ప్రాంతాలను సందర్శించారు.రాబోయే రెండు రోజులు కూడా భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా కోరారు.పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ అధికారులు సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.కిన్నెరసాని నది గేట్లు ఓపెన్ చేసే సమయాల్లో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామం నుండి ఎప్పటికప్పుడు పరిస్థితిని గురించి సమాచారాన్ని సేకరించి అవసరమైతే అక్కడికి చేరుకొని ప్రజలకు అండగా ఉండాలని తెలియజేసారు.అనంతరం రాజాపురం,యానాంబైలు గ్రామాల మధ్యలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జ్ ను సందర్శించారు.





## రైతన్నల సంబరాలలో చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జి భీమ్ భరత్

చేవెళ్ల..జులై 19(వాయిస్ టుడే)రైతు నేస్తం పథకం క్రింద కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రైతు రుణమాఫీ చేసిన శుభ సందర్భంగా. షాబాద్,చేవెళ్ల,శంకర్పల్లి మండలాలలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన రైతన్నల సంబరాలలో ముఖ్యఅతిథిగా చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జ్ పామేనా భీమ్ భరత్ పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఫోటోలకి పాలాభిషేకం చేశారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి ,కాంగ్రెస్ ముఖ్య నాయకులు,స్థానిక మండల నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సిఐ చంద్ర శేఖర్



మక్తల్ జులై 19 వాయిస్ టుడే ప్రతినిధి: భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా మక్తల్ సర్కిల్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని సిఐ చంద్ర శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున ఈ సందర్భంగా సిఐ చంద్ర శేఖర్ మాట్లాడుతూ... ప్రజలు మక్తల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరు. ముఖ్యంగా కృష్ణ నది పరివాహక ప్రాంత ప్రజలు చేపల వేటకు వెళ్ళరాదని, పుట్టిల ద్వారా ప్రయాణం చేయరాదని, నదిలోకి సెల్ఫీ ఫోటోలకు, ఈత కొట్టడానికి వెళ్ళరాదని తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలని సిఐ గారు తెలిపారు.

ప్రస్తుతం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది కావున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని అన్నారు. మక్తల్ సర్కిల్ పరిధిలోని ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుంది మరియు ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, చెరువుల వద్దకు వెళ్ళవదని, చెట్ల కింద,పాడైన భవనాలు కింద,శిధిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండవద్దని విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్ఫార్మర్స్ ముట్టుకోరాదని, ఎవ్వరు కూడా ఎట్టిపరిస్థితుల్లో కూడా చెరువులోకి,నాలాలు , వాటర్ ఫాల్స్ లేదా చేపల వేటకు గాని వెళ్ళరాదు. అత్యవసరమైతేనే ఇంటి నుండి బయటకు రావాలని సూచించారు. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్ & బి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్ల పై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు వైపులా బారికేడ్స్,హెచ్చరికలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కృష్ణ నది, చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకొని సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణించాలని,. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి , గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉందని.. కావున జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణించాలని, వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జి ల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని సూచించారు.

## ఆర్ఓబి నిర్మాణపనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

### కాజీపేట దర్గా బస్తీ దవాఖాన ఆకస్మిక తనిఖీ



వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో దర్గా కాజీపేట నుండి భట్టుపల్లి వైపు నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి ( ఆర్ఓబి)ని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య వివిధ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. LC-60 వద్ద నిర్మిస్తున్న ఆర్ఓబి కి సంబంధించి అటు భట్టుపల్లి వైపు, ఇటు హనుమకొండ వైపు కొనసాగుతున్న నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భట్టుపల్లి వైపు ఉన్న అలైన్ మెంట్ ను పరిశీలించారు. ఆర్వోబీ నిర్మాణానికి కావలసిన ల్యాండ్ అలైన్ మెంట్ ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ ఆర్ఓబి, కుడా మాస్టర్ ప్లాన్ కు అలైన్మెంట్ మ్యాచ్ అవుతుందా అని కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, కాజిపేట తహశీల్దార్ బావ్ సింగ్, కుడా పీవో అజిత్ రెడ్డి, ఆర్ఐ దశరధరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**బస్తీ దవాఖాన ఆకస్మిక తనిఖీ..**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం దర్గా ఆర్ఓబి పనులను పరిశీలించిన కలెక్టర్ మార్గమధ్యలో ఉన్న కాజీపేట దర్గా బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానకు సంబంధించిన గదులను, వైద్యులు, సిబ్బంది, ప్రజలకు వైద్య సేవలు అందించే రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్యులు సిబ్బంది హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. వైద్య సేవల కోసం అక్కడికి వచ్చిన పేషంట్లతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను, మందుల లభ్యత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు సిబ్బందితో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వైద్య సేవల కోసం వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా భరోసానందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, బస్తీ దవాఖానాల నోడల్ అధికారి ఇఫ్తేకారు అహ్మద్, మెడికల్ అధికారి వివేక్, తదితరులు పాల్గొన్నారు.

# మార్పు తెస్తామన్నారు.. మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు

**అధికారంలోకి వచ్చి**
**8 నెలలు అయిన చేసింది శూన్యం**

**రైతు, దళిత, బీసీ, మైనార్టీ బంధులు బంద్**

**24 గంటల కరెంట్,**
**కేసీఆర్ కిట్, సాగు నీరు బంద్**

**చేతల పర్వం కాదు.. కాంగ్రెస్ కోతల పర్వం..**

**బీసీ మంత్రులు బీసీల పక్షాన**
**మాట్లాడకపోవడం బాధాకరం**

**గుడిసెవాసులకు ఇచ్చిన నోటీసులను వెంటనే**
**వెనక్కి తీసుకోవాలి**

**మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**



వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: మార్పుతెస్తామని అని చెప్పి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీ ఛీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ 200 యూనిట్ల ఉచిత కరెంటు లబ్ధిదారుల్లో కోతలు, 500 గ్యాస్ సబ్సిడీ లబ్ధిదారుల్లో కోతలు, నేడు రుణమాఫీ అమలులో రైతు లబ్ధిదారుల్లో కోతలు, రాబోవు రోజుల్లో రైతుబంధు లబ్ధిదారుల్లోనూ కోతలు విధించేలా ఉన్నారని అన్నారు. గతంలో వ్యవసాయం దండుగ కాగా కేసీఆర్ హయాంలో పండుగైందని.. 11 విడుతల్లో రైతుబంధు ద్వారా 72 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో వేయడం జరిగిందన్నారు. 32 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేయడం జరిగిందని, కానీ నేడు కాంగ్రెస్ హయాంలో లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేశామని అన్నారు. అందుకు గానూ 6,098 కోట్ల రూపాయలు కేటాయించామని అన్నారు కానీ గతంలో కేసీఆర్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ కోసం 17 వేల కోట్లను ఖర్చు చేసిందని వినయ్ భాస్కర్ తెలిపారు. మరి 6 వేల కోట్లతోనే లక్ష రూపాయల వరకు రైతు రుణాన్ని మాఫీ చేశామని అంటున్నారు కదా.. అది ఎలా సాధ్యం అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అసలు లక్ష రూపాయల రుణమాఫీ ఎంతమందికి ఇచ్చారు? అసలు లక్ష రూపాయల రుణాలు ఎంత మంది తీసుకున్నారు? రుణమాఫీలో ఏ నిబంధనలు అమలు చేశారు? ఎంతమందికి రుణమాఫీ వర్తించలేదో వారి వివరాలు సైతం తెలపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది అన్నారు. 30 వేల ఉద్యోగాలు కల్పించామన్న చందంగానే ఈ రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోంది. రైతులను ఏమార్చే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోంది. కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన వాటిలో రైతు రుణమాఫీ ఒక్కటి మాత్రమే అమలు చేశారు. మరి రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు, కూలీలకు 12 వేలు, పసుపు బోర్డు ఏర్పాటు, రైతు కూలీలకు బీమా, వ్యవసాయానికి ఉపాధి హామీ, ధరణి రద్దు, రైతు కమీషన్ ఏర్పాటు, పోడు పట్టాలు వీటి సంగతి ఏంటీ. రాష్ట్రంలో 40 లక్షలకు పైగా రైతులు రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందికే రుణమాఫీ చేస్తున్నారు. ఇప్పటి వరకు రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. రుణమాఫీ నిధులు రైతుబంధు నిధులే. మరి కౌలురైతులు రుణాలు తీసుకున్నారు వారి పరిస్థితి ఏంటీ అని వినయ్ భాస్కర్ ప్రశ్నించారు. పాసుబుక్ ఆధారంగా రుణాలు మాఫీ చేస్తే పోడు, కౌలు రైతులు ఏం కావాలి.. మరీ ముఖ్యంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పటి వరకు బీసీలకు ప్రత్యేక పథకాలను అమలు చేసిన పాపాన పోలేదు, బీసీ బంధును ఆపివేసింది, బీసీ కులగణన గాలికి వదిలేసిందని. స్థానిక సంస్థల ఎన్నికల్లో 27 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 47 పెంచుతామన్నారు. కానీ బీసీ కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం బీసీలను మోసగించడమే అని మండిపడ్డారు. మంత్రివర్గంలో ఉన్న బీసీలకు ప్రాధాన్యత లేకపోవడం ఆయా మంత్రులు సైతం బీసీల పక్షాన మాట్లాడకపోవడం బాధాకరమని వినయ్ భాస్కర్ ఆవేదన చెందారు.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 10 ఏండ్ల పాలనలో ఏనాడూ పేదవాడి గుడిసెల జోలికి బీఆర్ఎస్ ప్రభుత్వం పోలేదు కానీ కాంగ్రెస్ సంస్కృతి పేదలను కొట్టడం పెద్దలకు పెట్టడం మాదిరిగానే నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 7 నెలల్లోనే పేదలపై పడ్డారని ధ్వజమెత్తారు. నగరంలో దాదాపు 25 చోట్ల పేద ప్రజలు ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటుండగా పేదల గుడిసెల కూల్చివేతకు కుట్రపూరితంగా ప్రణాళికలు చేస్తూ దానిలో భాగంగా నోటీసులు ఇచ్చారన్నారు వినయ్ భాస్కర్. పేదల పక్షాన ఉండాల్సిన స్థానిక శాసనసభ్యులు గుడిసెవాసులను భయపెడుతున్నారని.. కమ్యూనిస్ట్ పార్టీల మద్దతుతో ఎన్నికల్లో ఓట్లు దండుకున్న కాంగ్రెస్ నేడు పేదలపై పెత్తనం చేస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా వారిని పేదల పక్షాన, గుడిసెవాసుల పక్షాన అండగా ఉండాలని డిమాండ్ చేస్తున్నామని.. లేనిపక్షంలో గుడిసెవాసుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. ఈ ఉద్యమంలో కలిసివచ్చి వారినందరిని కలుపుకొని రానున్న రోజుల్లో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని.. అప్పటిలోగా స్థానిక శాసనసభ్యులు అధికారులు ఇచ్చిన నోటీసులు వాపసు తీసుకునేలా చేయాలని వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న క్రమంలోనే 1994లో కాంగ్రెస్ పార్టీ పట్టాలు ఇవ్వకపోవడంతో పేదల పక్షాన పోరాడి పట్టాలు ఇప్పించడం జరిగిందని అన్నారు. అన్న స్వర్గీయ మాజీమంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ ఆధ్వర్యంలో పేదలకు పట్టాలు ఇప్పించేందకు ఆమరణ నిరాహార దీక్ష సైతం చేసి పట్టాలు ఇప్పించిన విషయాన్ని గుర్తు చేశారు. 2004, 2005 సంవత్సరాల్లో, 2014,2019 సంవత్సరాల్లోనూ సీపీఐ, సీపీఎం, ఇతర సంఘాల ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ హయాంలో హనుమకొండలోని ఇందిరానగర్, లష్కర్ సింగారం, సాయి నగర్ బాలసముద్రం పరిధిలో ఏర్పాటు చేసిన గుడిసెవాసులకు పట్టాలు ఆయా సంఘాల నాయకుల చేతుల మీదుగా అందించామని వినయ్ భాస్కర్ వివరించారు. ఇది ప్రజా పాలన కాదని ప్రజలపై కాంగ్రెస్ దౌర్జన్య పాలన నడుస్తోందని వినయ్ భాస్కర్ మండిపడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు గుడిసెవాసులకు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని మాజీ ఛీఫ్ విప్ వినయ్ భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, డివిజన్ అధ్యక్షులు సదాంత్, రామ్మూర్తి, కోటేశ్వర్‌రావు, నాయకులు ఇమ్మడి రాజు విజయ్ ప్రకాశ్ రెడ్డి, బుద్దె వెంకన్న, మాలకుమ్మరి పరుశురాములు, విద్యార్థి నాయకులు గొల్లపెల్లి వీరస్వామి, గండ్రకోట రాకేష్ యాదవ్, రాజ్‌గోపాల్, ప్రణయ్, స్నేహిత్, తదితరులు పాల్గొన్నారు.




## గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు

**ప్రమాద రహిత సంస్థగా సింగరేణి**

**కార్మిక సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకుంటాం**

**రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సీఎండీ ఎన్.బలరామ్**

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే 19) గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, కార్మిక సంఘాలు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకొని అవసరమైన చర్యలను తక్షణమే తీసుకుంటామని సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండి ఎన్.బలరామ్ ప్రకటించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో శుక్రవారం జరిగిన 48వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశంలో ఆయన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మికసంఘాల ప్రతినిధులు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు, సింగరేణి అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశానికి గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ వి. సీతారామయ్య అధ్యక్షత వహించారు. ఛైర్మన్ ఎండి బలరామ్ మాట్లాడుతు సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శప్రాయంగా ఉందని, అలాగే రక్షణలో కూడా ప్రమాద రహిత కంపెనీగా రూపుదిద్దాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ప్రతి కార్మికుని ప్రాణాలు ఎంతో విలువైన వని, ప్రాణనష్టం జరగకుండా, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అలాగే యాజమాన్యంతో పాటు కార్మికులు కూడా రక్షణను ఖచ్చితంగా పాటించాలని కోరారు.

చాలా ప్రమాదాల్లో నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్లే చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ లేని పని ప్రదేశాల్లో విధులు నిర్వహించమని యాజమాన్యం ఎప్పుడూ ఒత్తిడి చేయబోదని.. అదే సమయంలో ప్రతీ ఒక్కరూ కూడా స్వీయ రక్షణ అత్యం ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా జరిగిన ఈ సమావేశంలో గనుల్లో రక్షణ పెంపుదలకు కార్మిక సంఘాలు అనేక సూచనలు చేశాయి, నాణ్యమైన హెల్మెట్లు బూట్లు సరఫరా చేయాలని, వైద్య సేవలు పెంపుదల, క్యాంటీన్లలో మెరుగైన సౌకర్యాలు, కొత్త యంత్రాల కొనుగోలు, ఆధునీకరణ, అవసరమైన సిబ్బంది నియామకం వంటి అనేక అంశాలపై గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐ.ఎన్.టి.యు.సి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ , ఇతర నాయకులు అనేక సూచనలు చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ మై సేఫ్టీ రీజియన్ 2 ఎన్.నాగేశ్వరరావు, ఇతర డి.జి.ఎం.యస్. అధికారులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొన్ని సూచనలు చేశారు. అనంతరం సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ (ఈ అండ్ ఎం) ఎన్ వి కే శ్రీనివాస్ (ఆపరేషన్స్ అండ్ పర్సనల్), జి వెంకటేశ్వర్ రెడ్డి (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) రక్షణ చర్యలపై ప్రసంగించారు. సమావేశంలో ముందుగా ఇటీవల పలు ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమానికి డీజీఎం సేఫ్టీ జ్ఞాన సుందరం స్వాగతం పలకగా, జనరల్ మేనేజర్ సేఫ్టీ గురవయ్య రక్షణ నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ జి. దేవేందర్, జీ.యం. (.సీ.పి.పి) జక్కం రమేష్ జీ. యం. (పి&పి) సాయిబాబా ఇంకా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు, అన్ని ఏరియాలనుంచి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు, డీ.జీ.ఎం.యస్ అధికారులు పాల్గొన్నారు.

## వరదల పట్ల అప్రమతంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 19: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల జిల్లా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా జితేష్ వి. పాటిల్ కలెక్టర్ అన్నారు.శుక్రవారం అదనపు కలెక్టర్ లు ,ఆర్డీవోలు, తాసిల్దారులు, ఎంపీడీవోలు, ఇరిగేషన్ అధికారులు జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు వరదలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇరిగేషన్ అధికారులు అన్ని ప్రాజెక్టుల వద్ద ఇసుక బస్తాలు అందుబాటులో ఉంచాలని, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని ప్రాజెక్టుల వద్ద గేట్లు తెరుచు సమయం ముందుగా క్రింద ఉన్న గ్రామాలకు తెలియజేయాలని ఆదేశించారు. నీరు క్రిందకి వదిలిన వెంటనే తాసిల్దారులు, ఎంపీడీవోలు అన్ని గ్రామాలకు చాటింపు ద్వారా తెలియజేయాలని, ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ప్రతి గ్రామాలలో పునరావాస కేంద్రాలను గుర్తించాలని తెలిపారు. అన్ని గ్రామాలలో మరమ్మతులకు గురైన బ్రిడ్జిలు గుర్తించి వాటికి తగిన మరమ్మత్తులను సత్వరమే పూర్తి చేయాలని తెలిపారు. వరద సాయం కు కావలసిన పనిముట్లు లైట్లు, మైకులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామ సెక్రెటరీ కి మైకు మరియు టార్చ్ లైట్ అందజేస్తామని తెలిపారు. తాసిల్దారులు అందరికీ వరద నష్టం పై ఇచ్చే పరిహారంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అన్ని మండలాల ఎంపీడీవోలు అప్రమత్తంగా ఉంటూ వరద అనంతరం గ్రామాల్లో కరెంటు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో తక్షణమే పారిశుద్ధ్యం చేపట్టి బ్లీచింగ్ చెయ్యాలని తెలిపారు. వరద బాధితులకు కావలసిన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వరద బాధితులకు పునరావస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు కల్పించాలని తాసిల్దారులను ఆదేశించారు.వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అవసరమైతే హెలికాప్టర్ ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. దీనికిగాను సంబంధిత అధికారులతో పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.వరద సహాయానికి కావలసిన పరికరాలు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు నివేదిక సమర్పించాలని తెలిపారు.

## కమిషనర్ సుధీర్ బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపిన బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ అజయ్ యాదవ్

వాయిస్ టుడే న్యూస్, జులై 19 బోడుప్పల్ : శుక్రవారం రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు IPSని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజల శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలి అని కొరాడం జరిగిందని తెలిపారు.



# కళ్యాణం కమనీయం శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

### శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కళ్యాణం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్



వాయిస్ టుడే న్యూస్, జులై 19 మేడిపల్లి : మేడ్చల్ జిల్లా, మేడిపల్లి మండలం పర్వతాపూర్ పీర్జాదిగూడలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీనివాస కళ్యాణం మహోత్సవమునకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా యువ మోర్చా అధ్యక్షులు బండారు పవన్ రెడ్డి, ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ అందరికీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలుపుతూ భక్తులని ఉద్దేశించి మాట్లాడుతూ..ఇది నా గెలుపు కాదు. మల్కాజగిరి ప్రజల గెలుపు.. నా గురించి ఎన్నో సంవత్సరాలుగా వారికి తెలుసు. అందుకే నా ప్రయత్నం ఎక్కువ లేకపోయినా నన్ను గెలిపించారు. ఇక్కడి స్థానికులే వారి భూమిని కాపాడుకుని వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించడానికి సంకల్పం తీసుకున్నారు. నేను అన్ని విధాలా వారికి తోడుగా ఉంటానని హామీ ఇస్తున్నాను. నేను ఎన్నికలలో ఈ పీర్జాదిగూడ మున్సిపాలిటీని ప్రజల్ని సరిగా కలవలేదు.కానీ నన్ను ఆత్మీయునిగా భావించి, వారే నన్ను గెలిపించారు. ప్రధాని మోదీ కూడా ఎప్పుడూ తాను ప్రజలకు నాయకుడిని కాదు. సేవకుడినని చెప్తుంటారు. అలాగే నేను కూడా మీకు సేవకునిగా, పిలిస్తే పలికే నాయకునిగా ఉంటానని హామీ ఇస్తున్నాను. పార్టీలు, నాయకులు మారినా వ్యవస్థలు మారవు. కానీ ఎప్పుడో కాస్త డబ్బు కూడబెట్టుకుని కట్టుకున్న ఇళ్లను కూలదోయడం అమానుషం. దీనిపై తప్పకుండా పోరాటం చేస్తాను. భారతదేశంలో 140 కోట్ల మంది ప్రజలు కలిసికట్టుగా, ప్రశాంతంగా ఉందని చెప్పవచ్చు. మన సాంప్రదాయాలు, సంస్కృతే దానికి కారణం. భారతీయులలోని ఆధ్యాత్మిక చింతనే ఈ ఐకమత్యానికి కారణం. గతంలో పెద్ద కుటుంబాలు కూడా పదిమంది పిల్లలతో హాయిగా ఉండేవారు. ఇప్పుడు ఒకరిద్దరు పిల్లలు ఉన్నా కూడా వారికి ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయపడుతున్నారు. అందుకే భారతదేశంలో ఏ గ్రామానికి వెళ్లినా గుడి ఉంటుంది. మన సంప్రదాయాన్ని మరచిపోరు. ప్రభుత్వం అంటే ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు అందించడమే కాదు, ప్రజల నమ్మకాల్ని నిలబెట్టాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. అందుకే కాశీ దేవాలయం, అయోధ్య దేవాలయాలను అద్భుతరీతిలో నిర్మించి, జాతికి అంకితం చేశారు. ప్రధాని మోదీ. ఆయన మార్గంలో మేము కూడా ఇక్కడ ప్రజలకు ఎప్పుడైనా అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారంలో తోడుంటానని హామీ ఇస్తున్నాను అని తెలిపారు.కళ్యాణ మహోత్సవ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని దేవుని దర్శించుకున్నారు.



## నోటీసులను తక్షణమే నిలుపుదల చేయండి: సిపిఎం

### ఇండ్లు కూలిస్తే రోడ్డున పడే పరిస్థితి ఉంది

### కలెక్టర్ తో సిపిఎం జిల్లా ప్రతినిధి బృందం

వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: చెరువులు, కుంటలలో పేదలు మధ్యతరగతి ప్రజలు వేసిన ఇండ్లను కూల్చివేయాలని హైకోర్టు డైరెక్షన్ పేరుతో మున్సిపాలిటీ అధికారులు ఇస్తున్న నోటీసులను తక్షణమే నిలుపుదల చేయాలని.. ఆ భూములలో గత 30 సంవత్సరాల నుండి ఇండ్లు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు భూమి బదులాయించి పట్టాలు ఇవ్వాలని సిపిఎం ప్రతినిధి బృందం కలెక్టర్ ను కోరారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ని కలెక్టర్ కార్యాలయంలో కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సిపిఎం ప్రతినిధి బృందం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ హనుమకొండ నగరంలో ఉన్న బంధం చెరువు, గోపాలపురం చెరువు, కోట చెరువు, భద్రకాళి చెరువులను ఆక్రమించారనే పేరుతో పేదలు నివసిస్తున్న నాగేంద్రనగర్, ప్రగతినగర్, వీవర్స్ కాలనీ మరియు ఇతర కాలనీలలో నివసిస్తున్న పేద, మధ్యతరగతి ప్రజలు గత 30 సంవత్సరాలుగా నివాసముంటున్నారని, వీరికి మునిసిపాలిటీ నుండి ఇంటి నెంబర్ లు కూడా వచ్చాయని.. నీటిపన్ను, ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నారని వారు తెలిపారు. కరెంటు బిల్లులు కడుతున్నారన్నారు. అక్కడే అన్ని రకాల ప్రభుత్వ గుర్తింపులు ఉన్నాయని.. అయినా కూడా నోటీసులు ఇచ్చి కూలుస్తామని చెప్పడంతో ప్రజలు చాలా ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇండ్లు కూలిస్తే వీరికి ఎలాంటి ఆధారం లేకుండా రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. ఇదే బంధం చెరువు పరిధిలో ఇప్పటికే అనేక ప్రభుత్వ కార్యాలయాలకు, వివిధ వర్గాలకు పిఎఫ్, డిఆర్డిఒ, కాజీపేట తాసిల్దార్ కార్యాలయం, మూగ చెవిటి, ఫోరెన్సిక్ ల్యాబ్, ఎక్స్ సర్వీస్ అధికారులకు, విలేఖరులకు, కుల సంఘాలకు ప్రభుత్వమే స్థలాలు కేటాయించారని తెలిపారు. కావున గత 30 సంవత్సరాల నుండి పేద, మద్యతరగతి ప్రజలు వేసుకొన్న ఇండ్లకు రక్షణ కల్పించి ఆ భూమిని బదిలాయించి పట్టాలు ఇవ్వాలని కలెక్టర్ ను కోరారు. సిపిఎం ప్రతినిధి బృందం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవ రెడ్డి, జి. ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మేళ్లచెరువు, చింతలపాలెం మండలంలో కలెక్టర్ పర్యటన

### సి .హెచ్.సి. లో ఆకస్మిక తనిఖీ కలెక్టర్

### పి.హెచ్.సి.లలో మెరుగైన వైద్యం అందించాలి.

### ముక్త్యాల కెనాల్ బ్రాంచ్ స్థల పరిశీలన

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.



వాయిస్ టుడే న్యూస్ చింతలపాలెం మేళ్లచెరువు: సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం చింతలపాలెం మేళ్లచెరువు మండలాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించారు. మొదట మేళ్లచెరువు మండలంలో. సిహెచ్ సి ని. ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లాలో వర్షాలు పడుచున్నందున మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రభలకుండా పి.హెచ్.సి.కి వచ్చే వారికి టెస్టు చేపట్టి రిపోర్ట్ ఆధారంగా చికిత్స అందించాలని, పి.హెచ్.సి ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పి.హెచ్.సి లలో మందుల కొరత ఉండకూడదని మందుల స్టోర్ తో పాటు స్టాక్ వివరాలను పరిశీలించారు.తదుపరి సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి ప్రతి ఒక్కరు హాస్పిటల్ లో అందుబాటులో ఉండాలని సిబ్బంది కి సూచించారు.

#### ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పంప్ హౌజ్ నిర్మాణ స్థలంను పరిశీలించిన జిల్లా కలెక్టర్

చింతలపాలెం మండలం వెల్లటూరు రెవిన్యూ పరిధిలో నిర్మించే ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పంపు హౌజ్ నిర్మాణానికి అవసరమయ్యే 68.28 ఎకరాల భూమిని పరిశీలించి త్వరిగతిన భూసేకరణ చేపట్టి పంపు హౌజ్ నిర్మాణంకు కృషి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో హుజూర్నగర్ ఆర్.డి.వో. శ్రీనివాసులు,డాక్టర్ వేణు గోపాల్, మేళ్లచెర్వు తహసీల్దార్ జ్యోతి, చింతల పాలెం తహసీల్దార్ సురేందర్ రెడ్డి, అధికారులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నెక్కొండ మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

### మండలంలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ కళాశాలలు, కార్యాలయాలు తనిఖీ

### మహిళలు స్వయం ఉపాధి కల్పనతోపాటు ఆర్థికంగా ఎదగాలి



వాయిస్ టుడే, వరంగల్ జిల్లా: వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్, జడ్పీహెచ్ఎస్ నెక్కొండ, బాలిక ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల వ్యవసాయ కార్యాలయం, నెక్కొండ మండలం అప్పలరావుపేటలో ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, అలాగే ప్రాథమిక ఉన్నత పాఠశాల బొల్లి కొండ, ప్రజా పాలన కేంద్రాన్ని, ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి సమర్ధ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు. నెక్కొండ మండలంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఐదున్నర గంటలపాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పీహెచ్సీతో పాటు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయగా విధులపట్ల నిర్లక్ష్యం వహించి అనధికారికంగా గైరాజరైన వైద్యాధికారికి, వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీస్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వైద్యాధికారి కోసం వేచి ఉన్న పేషంట్ లతో కలెక్టర్ మాట్లాడారు. ఆసుపత్రిలో పరిస్థితిని చక్కబెట్టాలని తహసీల్దార్ రాజ్ కుమార్ ను ఆదేశించారు. బొల్లికొండ ప్రాథమిక పాఠశాల ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా కేవలం ఒక విద్యార్థిని మాత్రమే పాఠశాలకు హాజరవడం పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు మెరుగైన విద్య భోదించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులు అందరూ ప్రతిరోజు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే ప్రాంగణంలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేయగా నమోదై ఉన్న 13 మంది విద్యార్థులు రోజు పాఠశాలకు వచ్చేలా పనిచేయాలని అంగన్ వాడీ సిబ్బందిని హెచ్చరించారు. కెనాల్ కాల్వపై నుంచి విద్యార్థులను అంగన్వాడీకి పాఠశాలకు సంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారని తెలుపగా.. ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని గ్రామస్థులు కోరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

తెలంగాణ రెసిడెన్సియల్ స్కూల్, నెక్కొండ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అప్పల్రావుపేట పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగపరిచి అహ్లాదకరమైన వాతవరణం కల్పించాలన్నారు. నెక్కొండలో శిథిలా భవనంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్నీ మరోచోటికి మార్చాల్సిందిగా సూచించారు. వ్యవసాయాధికారి కార్యాలయాన్ని సందర్శించి రుణమాఫీ కు సంబంధించిన వివరాలు ఆడిగి తెలుసుకున్నారు. తోపనపల్లిలో గ్రామైఖ్య సంఘం మహిళల సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరై మహిళలు గ్రామస్థాయిలో పరిశ్రమను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలు కిరాణం దుకాణం, మీ సేవాకేంద్రం కాకుండా ఏదో ఒక స్వయం ఉపాధిని ఎంచుకునేందుకు రుణాలు తీసుకోవాలని ఆలోచింపజేశారు. వారి ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. మహిళలకు స్వయం ఉపాధికల్పనతోపాటు ఆర్థికంగా ఎదిగేందుకు ముందుకు సాగాలని సూచించారు. స్థానికంగా దొరికే ముడిసరుకుతో ఉత్తత్తి కేంద్రాలను తయారు చేసుకోవాలన్నారు. గ్రామమంతా సమిష్టిగా ఆలోచించి దిశగా ముందకుసాగినతే అవసరమైన సూచనలు, సలహాలు, చర్యలను తీసుకుంటామని కలెక్టర్ మహిళలకు తెలిపారు.

#### ప్రజాపాలన కేంద్రం తనిఖీ..

నెక్కొండ మండలపరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడికోసం దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన వారితో మాట్లాడి పెండింగ్ సమస్యలేమైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ తనిఖీల్లో తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపీడీవో వీరయ్య, ఆర్ ఐ నరేందర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.



## ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ చైర్మన్‌ను కలిసిన రైల్వే కార్మిక నేతలు

వాయిస్ టుడే, కాజీపేట: తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని శుక్రవారం ఉదయం ఆయన నివాసంలో రైల్వే కార్మిక ఉద్యమ నేత, కాజీపేట రైల్వే డివిజన్ కోచ్ ఫ్యాక్టరీ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, ఏఐఆర్ఆర్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ర యాదవ రెడ్డి, అఖిలభారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, ఎస్సీ ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ నేత కురుసపల్లి రవీందర్, ఏఐజీడిఎస్ నాయకులు మర్రి కుమురారెడ్డి, పిట్టల అశోక్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఫెడరేషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జంగా రాఘవరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏ ఐజిడిఎస్ జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే జంగా రాఘవరెడ్డికి ప్రభుత్వం ఫెడరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందని అన్నారు. కాజీపేటలో నిర్వహించిన అఖిలభారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభలకు జంగా రాఘవరెడ్డి రెడ్డి ఎంతో సహకరించారని పేర్కొన్నారు. ముందు ముందు ఆయన మరెన్నో ఉన్నతమైన పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.



## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: కడియం

### రైతులను ఏనాడు పట్టించుకోని మోడీ

### నియోజకవర్గ అభివృద్ధే నాధ్యేయం.. సమస్యలు తన దృష్టికి తీసుకురావాలి

### కళ్యాణ లక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: రాష్ట్రంలోని రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండల కేంద్రం లోని %ూూ=% ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలే అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడ ఆగకుండా పేదవారిని ఆదుకుంటున్నారని స్పష్టం చేశారు. నిన్న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్ష రూపాయల లోపు పంట రుణాలను తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేశారన్నారు. ఆగస్టు చివరి వరకు రెండు లక్షల రూపాయల పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ జరగబోతుందని ఈ సందర్భంగా తెలిపారు. నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా పదవి బాధ్యతలు చేపట్టినా, ఏనాడు రైతులను పట్టించుకోలేదని రైతులను ఆదుకోవాలని ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ సంస్థలకు, బడా వ్యాపారవేత్తలకు రుణాలు మాఫీ చేస్తూ వారికి మాత్రమే అండగా నిలుస్తున్నారన్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఖచ్చితంగా అండగా ఉంటామని, ఎన్ని కష్టాలు వచ్చిన ఆదుకుంటామని గత ఎన్నికల ప్రచారంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మాట ఇచ్చారని గుర్తుచేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చారని చెప్పారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్నారని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం అభివృద్దే నా ధ్యేయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. రఘునాథపల్లి మండల అభివృద్ధి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలందరి భాగస్వామ్యంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 160 మంది లబ్ధిదారులకు 1 కోటి 60 లక్షల 18వేల 560 రూపాయల విలువగల కల్యాణ లక్ష్మి చెక్కులను అలాగే 22 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 5లక్షల 23 రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమావేశం సిఐటియు. అనుబంధ సంస్థ

వాయిస్ టుడే న్యూస్ మేళచెరువు ప్రతినిధి: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు ఇక ఈ కార్యక్రమంలో మేలచెరువు మండల భవన కార్మిక శాఖ అధ్యక్షుడు లకావత్ బాలాజీ నాయక్ మాట్లాడుతూ మేళ్లచెరువు మండలంలోని అన్ని రకాల భవన కార్మికులకు అన్ని విధాలుగా అన్నివేళలా వారిని ఆదుకుంటామని ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా ప్రయత్నం చేస్తామని ఈ సమావేశంలో తెలిపారు త్వరలో మేళ్లచెరువు మండలం, రామాపురం.వేపల మాదారం గ్రామాలకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని కార్మికుల పిల్లలు చదువుకునే వారికి స్కాలర్షిప్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రతి కార్మికుడు సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని చేయని యెడల ఎటువంటి పథకాలు వర్తించవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేళ్లచెరువు మండల కార్యదర్శి ధారావత్ శ్రీను. మహిళా సంఘం మండల కన్వీనర్ బాణావతి పార్వతి. భూక్య తిరపతి. గంగరాజు. సైదులు. ఠాగూర్. నాగరాజు. రాము. నాగులు. నరసింహారావు. శ్రీను.రామ కృష్ణ .ఇమామ్. వెంకటేశ్వర్లు .పాల్గొన్నారు.



వాయిస్ టుడే
హైదరాబాద్
శనివారం, 20 జూలై 2024



## 11 మంది పిల్లలకు అక్షరాభ్యాసం చేయించిన కార్పొరేటర్ దుర్వేష్ అనూప్

కరీంనగర్ జులై 19(వాయిస్ టుడే )అమ్మా మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా 48 డివిజన్ కార్పొరేటర్ దుర్వెష్ అనూప్ కుమార్ 11 మంది పిల్లలకి శుక్రవారం రోజున కరీంనగర్లోని మహాశక్తి ఆలయంలోని సరస్వతి దేవి వద్ద వేద పండితుల చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారుల అక్షరాభ్యాసం కోసం పలకలు బలపాల ను అనుప్ డొనేట్ చేశారు. మహాశక్తి దేవాలయంలోని ముగ్గురు శక్తి స్వరూపు అమ్మవార్ల దీవెనలు చిన్నారులపై ఉండాలని , విద్యతోపాటు అన్నింట ఆ చిన్నారులు విజయం సాధించాలని అమ్మవార్లను వేడుకున్నట్లు కార్పొరేటర్ అనూప్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో 57 వ డివిజన్ కార్పొరేటర్ సుమా రమణారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ బలమూరి విజయ, అంగన్వాడీ టీచర్స్ వనజ, పద్మావతి, పద్మలత తదితరులు పాల్గొన్నారు.





## మృతుల కుటుంబాలకు బాసటగా నిలిచిన గండ్ర పల్లె సేవ ఫౌండేషన్

### ఆసరాగా నిలిచిన ప్రజా సేవకుడు గాదె ప్రభాకర్ పటేల్

జమ్మికుంట జూలై 19(వాయిస్ టుడే): జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికి చెందిన పలువురు ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన వారి కుటుంబాలను గండ్ర పల్లి ప్రజా సేవకుడు మరియు గండ్ర పల్లి సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు గాదె ప్రభాకర్ పటేల్ ఓర్సు ప్రవీణ్ కుమార్ గాదె దినేష్ పటేల్ శుక్రవారం పరామర్శించి కట్కోజ్వల కుమార్ స్వామి అనారోగ్యంతో చనిపోవడం జరిగింది వారి కుటుంబానికి సాయంగా పుల్లయ్య గారి లింగారావ్ వంతుగా 2000 రూపాయలు ఇవ్వడం జరిగింది అలాగే గండ్రపల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు గాదె ప్రభాకర్ పటేల్ 1000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది అలాగే శ్యామల వైష్ణవి చనిపోయిన విషయం అందరికీ తెలిసింది తన వంతు సాయంగా పోలీస్ మల్హాల్ రావు 1000 రూపాలు, గాదె రాజయ్య రాధా 1000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు.



## ఆల్ఫోర్స్ జీనియస్ స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు

హుజురాబాద్ జూలై 19(వాయిస్ టుడే): తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బోనాల ఉత్సవాలను ఆల్ఫోర్స్ జీనియస్ స్కూల్ హుజూరాబాద్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ స్కూల్స్ చైర్మన్ డా.వి నరేందర్ రెడ్డి పాల్గొని బోనాల ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేసారు. ఆషాడమాసంలో బోనాల ఉత్సవాలను జరుపుకుంటారన్నారు. భోనం అనగా భోజనం అని అర్ధమని, ఆషాడ మాసంలో అమ్మవారు తమ పుట్టింటికి వెళతారనీ, అమ్మవారిని భోనంతో ఎదుర్కొని ఓడి బియ్యం, చీరే, సారెలను అమ్మ వారికి అందించి పూజిస్తారన్నారు. విద్యార్థులు చదువుతో పాటుగా తమ సంస్కృతి ఆచార సంప్రదాయాలను గురించి తెలుసుకోవాలని చైర్మన్ నరేందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రెడ్ డే వేడుకల్లో పాల్గొని చిన్నారులు అద్భుత ప్రసంగం చేశారు. గురువారం రోజు పాఠశాలలో జరిగిన హౌజు ఎలక్షన్స్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డితో పాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చిన్నారి ఆపరేషన్ కు సహకారం ఎల్ ఓ సీ అందజేసిన ప్రణవ్ బాబు

జమ్మికుంట జూలై 19(వాయిస్ టుడే): జమ్మికుంట మండలం వావిలాకు చెందిన శ్రీనివాస్ స్వప్న దంపతుల కుమార్తె చిన్నారి సహస్ర బ్రెయిన్ ఆపరేషన్ కి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వోడితల ప్రణవ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రెండున్నర లక్షల ఎల్ఓసి అందజేసి పాప ఆపరేషన్ కు సహకరించారు. ఈ సందర్భంగా ప్రణవ్ పాప తండ్రి శ్రీనివాస్ ని పాప ఆపరేషన్ కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాప ఆపరేషన్ కు సహకరించినందుకు ప్రణవ్ వద్ద తండ్రి శ్రీనివాస్ కన్నీటి పర్యంతమైనారు. పాపను బ్రతికించినందుకు కాళ్లు మొక్కేందుకు వచ్చిన శ్రీనివాస్ ను ప్రణవ్ తిరస్కరించి అతన్నీ హక్కున చేర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ%ొ%. తన పాపకు మరో జన్మనిచ్చిన ప్రణవ్ కు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ప్రణవ్ చూపిన ఔదార్యానికి పలువురు ప్రశంసలు తెలిపారు.



# రైతులను వంచించి మోసం చేసింది కాంగ్రెస్ సర్కార్

**రైతు భరోసా ఎగ్గొట్టి**
**రైతు రుణమాఫీతో డ్రామాలాడుతుంది**

**నియమ నిబంధనలు కొర్రీలు పెట్టి**
**రైతు రుణమాఫీ ఎవరికి చేసినట్టు**
**రుణమాఫీ పేరిట ప్రచారాలు,**
**సంబరాలు చేసుకోవడానికి సిగ్గుండాలి**

**బిజెపి జిల్లా అధ్యక్షుడి**
**గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు**



కరీంనగర్ జులై 19(వాయిస్ టుడే )కాంగ్రెస్ పార్టీ లోగోడ ఎన్నికల సందర్భంగా రుణమాఫీ విషయంలో చెప్పింది ఒకటని , నేడు చేస్తుంది మరొకటని , రుణమాఫీ విషయంలో 6 పేజీల నియమ నిబంధనలు , కొర్రీలు పెట్టి రుణమాఫీ ఎవరికి చేశారో అర్థం కాని పరిస్థితి ఉందని , రైతు భరోసా ను ఎగ్గొట్టి రుణమాఫీ పేరిట డ్రామాలు మొదలుపెట్టిందని , కాంగ్రెస్ సర్కార్ రైతాంగాన్ని వంచించి మోసం చేసిందని బిజెపి జిల్లా అధ్యక్షుడి గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు.. శుక్రవారం హుజరాబాద్ లో స్థానిక బిజెపి శ్రేణులతో ముఖ్య సమావేశం జరిగింది. సమావేశ అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులను గోస పెట్టిన ఏ ప్రభుత్వాలు కూడా మనగడ సాధించలేదని, రైతుల కష్టాలు పట్టని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వాళ్ల ఉసురు తగలడం ఖాయమన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్ని అడ్డదారులైన తొక్కి అధికారంలోకి రావాలనుకుని, అడ్డగోలు హామీలు ఇవ్వడమే కాకుండా వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్న తర్వాత తెలంగాణ ప్రజలు మరోసారి మోసపోయి దగాపడ్డమనే భావన ఏర్పడిందన్నారు. ప్రధానంగా రైతు రుణమాఫీ విషయంలో 34 వేల కోట్ల రూపాయల రుణమాఫీ అన్ కండిషనల్ గా ఒకేసారి చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చి నిబంధనలను తెరపైకి తెచ్చారన్నారు.ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని, రక్తాన్ని చెమటగా మార్చి, రెక్కలు ముక్కలు చేసుకుని.,ఆరుగాలం కష్టపడి ప్రజలకు బుక్కెడు బువ్వ పెట్టే రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. అప్పుల బాధ పోతది అని ఎదురుచూస్తున్న తెలంగాణ రైతులకు కాంగ్రెస్ సర్కార్ నిరాశను మిగిల్చిందని , రైతులకు రుణమాఫీ ఎగనామం పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కాకముందు అయిన తర్వాత రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలు ఒకసారి ప్రజలంతా గమనించాలన్నారు. ఆనాడు ఎందుకు రుణాలు కడుతున్నారు, కట్టకండి.. కట్టిన వాళ్ళు ఉంటే వెంటనే బ్యాంకుకు వెళ్లి 2 లక్షల రూపాయల రుణం తీసుకోండి అని చెప్పిన . రేవంత్ రెడ్డి నేడు మాట మారుస్తున్నారని మండిపడ్డారు. రేషన్ కార్డు పేరుతో సగం మందికి, ఇన్కమ్ టాక్స్ పేరుతో 20%, రీ షెడ్యూల్ చేసుకున్న పేరుతో ఇంకొంత మందికి మొత్తంగా రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. ఏడు నెలలు గడవకముందే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రైతులకు క్వింటాల్కు 500 బోనస్ ఇస్తామని చేతులెత్తేసిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్నిదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చిత్తు కాగితంతో సమానంగా చూస్తున్నారని, ఆగమాగంగా ఎమ్మెల్యేలను చేర్చుకుంటూ రాజకీయాలను చేస్తున్నారు తప్ప ప్రజలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం నిజాయితీ ఉన్న చిత్తశుద్ధి ఉన్న అన్ కండిషన్ గా రుణమాఫీ చేయాలని , రైతు లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్ల ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, జిల్లా కార్యదర్శి సిహెచ్ నరసింహా రాజు బింగి కరుణాకర్, పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు మండల అధ్యక్షులు రాముల కుమార్, జిల్లా నాయకులు , పట్టణ మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## కొట్టె సంతోష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్ జులై 19(వాయిస్ టుడే )కరీంనగర్ నగరంలోని సీతారాంపూర్ కి చెందిన బిఆర్ఎస్ నాయకులు కొట్టె సంతోష్ ఈనెల 10న హుజురాబాద్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం కొట్టే సంతోష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా సంతోష్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే తో పాటు బి ర్ స్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్ నగర మేయర్ సునీల్ రావు, స్థానిక డివిజన్ కార్పొరేటర్ జంగిలి సాగర్ తదితరులున్నారు.

## భక్తి పారవశ్యంగా అల్ఫోర్స్ బోనాల జాతర



కరీంనగర్ జులై 19(వాయిస్ టుడే )తెలంగాణ రాష్ట్రం సంస్కృతికి బంగారు నిలయం అని మరియు పండుగల పట్ల ఉత్సాహాన్ని పెంపొందించేది తెలంగాణ రాష్ట్రమేనని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్లో నిర్వహించినటువంటి బోనాల జాతరకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు మహంకాళి మాతకు పూజా కార్యక్రమాన్ని ఆచరించారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి శ్రీదుర్గా దేవి చిత్రపటానికి మరియు బంగారు బోనానికి ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాలు అమ్మవారి రూపాలుగా భావిస్తారని మరియు వారి అన్ని సమస్యలను పరిష్కరించుకుంటారని తెలుపుతూ మన రాష్ట్రంటోనే కాకుండా వివిధ రాష్ట్రాలలో బోనాలకు ప్రత్యేకత కల్పించారని చెప్పారు. నేటి కాలంలో చాలా మంది బోనాల పట్ల ఆసక్తిని ప్రదర్శించడమే కాకుండా వాటిలో పాల్గొనేందుకు చాలా శ్రద్ధ వహిస్తారని చెప్పారు. ప్రత్యేకంగా మన రాష్ట్రంలో బోనాల ఉత్సవాలు శాంతి శోభను విస్తరింపచేస్తుందని చెప్పారు. విద్యార్థులకు మన రాష్ట్ర సంస్కృతిని మరియు కళలను ప్రత్యక్షంగా తెలియజేయటానికై నేడు బోనాల ఉత్సవాలను చాలా ఉత్సాహం మరియు భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరిగిందని చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి తల్లి పెద్దమ్మ దయ ఉంచమ్మ, దీవనలు ఇవమ్మ, అంబాభవాన్ని... జగదాంబ భవాన్ని శారదే, పోతరాజుల విన్యాసాలు ఆకర్షింపచేశాయి. పాఠశాల ప్రాంగణాన్ని వివిధ పూలతో మరియు బెలున్లతో చాలా ఆకర్షనీయంగా అలంకరించారు. సుమారు 150 మంది వివిధ వేషాలతో విచ్చేసి పండుగ వాతావరణాన్ని తలంపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి సాయి కృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 19: బోయినిపల్లి మండలం లోని మర్లపేట గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన నక్క సాయికృష్ణ కుటుంబానికి, ఆర్థిక సహాయంగా 50.000 రూపాయలను కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సాయి కృష్ణ కుటుంబానికి ఇవ్వమని పంపించినారు, అంతేకాకుండా సాయి కృష్ణ కుటుంబ సభ్యులకు మరింత సహాయం చేస్తానని, ఎల్లవేళలా కష్టసుఖాలలో వారి కుటుంబానికి అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు, అలాగే విలాసాగర్ గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త సాగారం నాగరాజు తండ్రి కీర్తి శేషులు సాగారం నారాయణ ఇటీవల మూడు రోజుల క్రితం మరణించినారు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం కన్వీనర్ పెరుక శ్రవణ్ ,మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి , జాయింట్ కన్వీనర్ ఉదారి నరసింహ చారి, బీజేవైఎం మండల అధ్యక్షులు కొనుకటి హరీష్. మండల ప్రధాన కార్యదర్శి పరుశరాములు, మండల ఉపాధ్యక్షులు ఉపేందర్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు సుంకపాక ప్రభు సీనియర్ నాయకులు క్యాతం తిరుపతి రెడ్డి, బిజెపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి ,సాయి,రవి,చల్లాల లక్ష్మీనారాయణ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొలంలో కాంగ్రెస్ జెండాలతో రైతు సంబరాలు



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 19: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయడం తో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకుంటున్నారు. విలాసాగర్ లో ఏనుగుల కనకయ్య తో పాటు రైతు కు ఏకంగా ట్రాక్టర్ కు కాంగ్రెస్ జెండాలు పెట్టి పొలం లో పొలం పనులు చేసుకుంటున్నారు .ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగానే రైతులకు రుణమాఫీ చేసిందని అన్నారు ఎన్నో ఏళ్లుగా రుణమాఫీ కోసం ఎదురుచూశామని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నికల లో ఇచ్చిన హామీ ప్రకారం మొదటి విడత గా లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. రైతులకు రుణమాఫీ చేయడంతో ఎంతో మేలు కలుగుతుందని అన్నారు

## మృతురాలి కుటుంబానికి చేయూత

భీమదేవరపల్లి వాయిస్ టుడే జులై19: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం విశ్వనాథ కాలనీ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మిశెట్టి కొమురయ్య సతీమణి బొమ్మిశెట్టి ఐలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మిశెట్టి కొమురయ్యను పరామర్శించి ఓదార్చారు. అనంతరం పెద్ది వసంత మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యాన్ని కాంగ్రెస్ నాయకులు, కొమురయ్యకు అందించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టెంపెల్లి ఐలయ్య, మాజీ మండలాధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్, ఆదరి రవీందర్, శంకర్, సదానందం, వల్లెపు మహేందర్, వెంకన్న, సుధాకర్, ఐలయ్య, జంపయ్య, రమేష్ సగంటి వెంకటేష్ ఉన్నారు.



# రైతుల రుణమాఫీ పండుగ వాతావరణంలో గ్రామాలు

**హర్షం వ్యక్తం చేసిన రైతులు**

**రైతుగా వేదిక వద్ద సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు**

**పెద్ద ఎత్తున టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ శ్రేణులు**



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 19: ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా బోయినపల్లి మండలం కొదురుపాక రైతు వేదికలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం కొదురుపాక రైతు వేదికలో వ్యవసాయ అధికారి ప్రణీత ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ ప్రారంబోత్సవాన్ని వీడియో కాన్ఫరెన్స్ ను బోయినపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు రైతులు వీక్షించి ఆనందాన్ని వ్యక్తం చేశారు అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా బిసి సెల్ అధ్యక్షులు కూస రవీందర్ ,మాజీ డిసిఎంహెచ్ చైర్మన్ ముదుగంటిసురేందర్ రెడ్డి ,మండల అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి లు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే 31 వేయిల కోట్ల రైతుల రుణమాఫీ చేసిన దాఖలాలు ఇప్పటివరకు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు రైతుల పక్షానే ఉంటూ రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని వారు అన్నారు. ఇవే కాకుండా కొత్త పిచ్చన్లు,రైతు కూలీ మహిళకు 2500 రూపాయలు మహిళా ఖాతాలో జమ అవుతవనీ వారు తెలిపారు.రెండు లక్షల రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రి పొన్నం ప్రభాకర్ కు ,రైతులు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొదటి విడతలో లక్ష రూపాయలు రెండవ విడతలో లక్షల 50 వేలు మూడవ విడుదల రెండు లక్షల లోపు రుణమాఫీని ఆగస్టు 15 వరకు మంజూరు చేస్తారని అన్నారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ,మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యమునకు రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పుష్పలత, వ్యవసాయ అధికారి ప్రణీత, మాజీ ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, రాజన్న సిరిసిల్ల జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్, ఉమ్మడి జిల్లా మాజీ డిసిఎంహెచ్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి గౌడ్, బోలుమాశంకర్, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్ , సింగిల్ విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, నాయకులు ఏనుగుల కనకయ్య,బాలగోని శ్రీనివాస్ గౌడ్ , ఉయ్యాల శ్రీనివాస్, జంగం అంజయ్య,నాగుల వంశీ, శాలివాహన శ్రీనివాస్, బోయిని ఎల్లెష్ ,సంబ లక్ష్మి రాజం, కొమ్మన బోయిన సువిన్ యాదవ్, హరికిషన్, రాజశేఖర్ రెడ్డి,మహమ్మద్, డబ్బు వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పాఠశాల, ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

**ఖానామెట్టులో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేస్తాయాలి....**

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**



శేరిలింగంపల్లిబీ జులై 19(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం విద్యా కమిటీ సభ్యులు పలు సమస్యలను చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయదుర్గం విద్యా కమిటి సభ్యులు మాట్లాడుతూ రాయదుర్గం లోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి, ప్రభుత్వ డిగ్రీ కళశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రాయదుర్గం ప్రభుత్వ పాఠశాల మరియు జూనియర్ కళశాలలో మౌళికవసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, అభివృద్ధి చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేసుకుంటామని అన్నారు. ఖానామెట్ లో త్వరలోనే డిగ్రీ కాలేజ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, త్వరలోనే పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం విద్యా కమిటీ సభ్యులు కృష్ణా గౌడ్, నరేందర్ ముదిరాజ్, సురేష్, ప్రభాకర్, సుదర్శన్ మరియు తదితరులు పాల్గొన్నారు




## విద్యార్థులు భవిష్యత్తుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

**ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి**

సికింద్రాబాద్, జూలై 19 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యార్థులు తమ భవిష్యత్తుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి సూచించారు. తమ భవిష్యత్తు మెరుగ్గా ఉండేందుకు సరైన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో తెలంగాణ కామర్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ మీట్ 'వాణిజ్య- 2024 ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం పొందిన వారి సంఖ్యను కామర్స్ యూజీ విద్యార్థుల సంఖ్య మించిపోయిందన్నారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో అందించే యూజీ కోర్సులలో కామర్స్ విభాగానికే ఎక్కువ డిమాండ్ ఉందని చెప్పారు. కామర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ డి. చెన్నప్ప మాట్లాడుతూ ఇటీవలి కాలంలో తమ విభాగంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వాణిజ్య విభాగంలో ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డాక్టర్ రియాజ్, వాణిజ్య 2024 కన్వీనర్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్ ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ కృష్ణచైతన్య, ప్రొఫెసర్ ప్యాట్రిక్, డాక్టర్ సూర్యప్రవీణ్, ఎంవీ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# రాయల చంద్రశేఖర్ మరణం విప్లవోద్యమానికి తీరని లోటు

**నివాళులర్పించిన సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) వరంగల్ డివిజన్ కమిటీ**



వరంగల్ జూలై 19 (వాయిస్ టుడే) సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు, కిసాన్ సంయుక్త మోర్చా (SKM) తెలంగాణ ఇన్చార్జి కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ రైలు ప్రమాదానికి గురై మరణించడం విప్లవ, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అన్నారు. శుక్రవారం కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ను స్మరించుకుంటూ సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) వరంగల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ లోని చమన్ కోటలో వారి చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ ప్రజా పోరాటాల్లో ,రైతాంగ పోరాటాల్లో 50 సంవత్సరాలు అలుపెరుగని పోరాటం, కృషి చేశాడని, మొన్న రాత్రి ఊహించని విధంగా రైలు ప్రమాదంలో చంద్రశేఖర్ మరణించటం ప్రజా పోరటాలకు తీరని లోటని , చంద్రశేఖర్ ప్రజా పోరాటాలకు పెద్దపీట వేసి, పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పాలకులను, ప్రభుత్వాలను ప్రశ్నించి మచ్చలేని విప్లవ నాయకుడుగా ఎదిగిన కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఈరోజు మన మధ్య లేకపోవడం చాలా బాధాకర పరిణామమని తెలిపారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అమరుడు రాయల రవన్న చూపిన మార్గంలోనే నమ్మిన సిద్ధాంతం కోసం తుదికంత నిబద్ధత తో ఉన్నటువంటి ఆదర్శ కమ్యూనిస్టు రాయల చంద్రశేఖర్ అని గుర్తు చేశారు. అలాంటి వారిని కోల్పోవడం విప్లవ ఉద్యమానికి తీరని లోటు. ఖమ్మం జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో తిరుగుతూ అనేక రైతాంగ పోరాటాలను నిర్మించి, నాయకత్వం వహించాడు. అదేవిధంగా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏ.ఐ.పీ.కే.ఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా వారు కొనసాగుతున్నారు. ఇలాంటి తరుణంలో ఆయన మరణించడం విప్లవకారులకు, విప్లవోద్యమానికి పూడ్చలేని లోటన్నారు. ఎంతోమంది నీతి ,నిజాయితీ, నిబద్ధత కలిగిన కార్యకర్తలను తయారుచేసి విప్లవోధ్యమానికి అందించిన ఘనత రాయల చంద్రశేఖర్ కే ఉన్నదని తెలిపారు. వ్యవస్థ మార్పు కోసం జరిగే ప్రతి పోరాటంలో చంద్రశేఖర్ జీవించే ఉంటారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు మైదం పాణి,సాబిరికాని మోహన్, భైరబోయిన ఐలన్న, ఇనుముల కృష్ణ, కిషోర్, రాజేందర్, బాబు, జనార్ధన్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో 11 మంది ఎస్సైల బదిలీలు

**కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఐపీఎస్**



కరీంనగర్ జులై 19(వాయిస్ టుడే )కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 11 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ శుక్రవారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేసారు. ఈ ఉత్తర్వుల ప్రకారం టాస్క్ ఫోర్స్ లో పనిచేస్తున్న ఎస్.శ్రీధర్ ను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు, కమీషనరేట్ ఆఫీస్ నందు పనిచేస్తున్న జి.అనూష ను చొప్పదండి ఎస్సైగా, చొప్పదండి ఎస్సై గా పనిచేస్తున్న ఉపేంద్రాచారి ని కరీంనగర్ ట్రాఫిక్ విభాగానికి , కమీషనరేట్ ఆఫీస్ నందు పనిచేస్తున్న యూనస్ అహ్మద్ అలీ ని హుజురాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కు , కమీషనరేట్ ఆఫీస్ నందు పనిచేస్తున్న టి.వివేక్ ను జమ్మికుంట పోలీస్ స్టేషన్ కు , కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న పి. అభిలాష్ ను కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ కు, జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న ఎస్. రాజేష్ ను వి.ఆర్. కరీంనగర్ కు, కమీషనరేట్ ఆఫీస్ నందు పనిచేస్తున్న ఎన్. శ్రీనివాస్ ను కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ కు , హుజురాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న జి. సాంబయ్య ను సీసీఎస్ పోలీస్ స్టేషన్ కు , కరీంనగర్ వి.ఆర్. లో వున్న ఎస్. హనుమంతరావును పోలీస్ కంట్రోల్ రూమ్ కు బదిలీ చేశారు.

## హౌసింగ్ సొసైటీపై వస్తున్న ఆరోపణలు వాస్తవమే



వరంగల్ జూలై 19 (వాయిస్ టుడే) ఆర్యవైశ్య పట్టణ మ్యూచువల్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ పై వస్తున్న ఆరోపణలు వాస్తవేమో అని ఆ హౌసింగ్ సొసైటీ కి సంబంధించిన కొందరు సభ్యులు వాస్తవమే అని ప్రత్య ఆరోపణ చేశారు. గురువారం హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు గుండా ప్రకాష్ రావు విలేకరుల సమావేశంలో నిర్వహించి హౌసింగ్ సొసైటీ పై నిరాధారన మైన ఆరోపణలు అని అనడం అవాస్తవమని అనడం మేము ఖండిస్తున్నామని శు క్రవారం సొసైటీ సభ్యులు ప్రత్య ఆరోపణ చేశారు. హౌసింగ్ సొసైటీ పేస్ 1 లో గంగాదేవిపెల్లి శివారు మరియాపురం బొల్లి కుంట పేస్ 1 బొల్లికొండ పేస్ 2 లో సొసైటీ ఆధ్వర్యంలో వెంచర్లు 2019 వేశారని. నేటి వరకు అనగా జూలై 2024 వరకు కూడా ఇలాంటి అభివృద్ధి పనులు గాని సభ్యులకు ప్లాట్ల విభజనలో ముందడుగు వేయకుండా తమ స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా అధ్యక్షుడు తాన హిస్టారి రీతిన వ్యవహరిస్తున్న తీరు సొసైటీ సభ్యులకు ఆందోళన కలిగెల ఉన్నాయని సొసైటీ బైలా అనుగుణంగా కాకుండా తన ఇష్టా రీతిన తన కుటుంబ సభ్యులపై రిజిస్ట్రేషన్లు చేయించి సంబంధం లేని వాళ్ళకి అమ్మి సొసైటీ ఆస్తులను లూటి చేస్తున్నారని సొసైటీ లావాదేవీలపై కమిటీ వేసి విచారణ చేపట్టాలని సొసైటీలో ఉన్న సభ్యులకూ వారికి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి కేటాయించాలని సభ్యులు కోరుకుంటున్నారు. సొసైటీ నియమ నిబంధనలకు అనుగుణంగా డబ్బులు చెల్లించిన సభ్యులకు కూడా రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం చేయడంతో సభ్యుల్లో ఆందోళన నెలకొన్నదని అధ్యక్షుడు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో వ్యవహారం చెక్కదిద్దుకుంటూ తన లోపాలను బయటికి రాకుండా సొసైటీ సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు. లేఅవుట్ నిబంధనల ప్రకారంగా మార్టిగేజ్ చేసిన ప్లాట్లకు కూడా రిజిస్ట్రేషన్ చేస్తూ అక్రమార్జనకు అధ్యక్షుడు తేరలేపుతున్నారని ఇప్పటికైనా సొసైటీ లావాదేవీలపై అధ్యక్షుడి తీరుపై జిల్లా కలెక్టర్ కు సిపి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు సభ్యులు తెలియజేశారు. ఈ సమావేశం లో టీ వెంకటేశ్వర్లు విద్యాసాగర్ వెన్శెట్టి సదా కుమార్ జి విమల దేవి సరళ దేవి పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

**తొర్రూర్ ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్**

తొర్రూరు, జూలై 19 వాయిస్ టుడే : తొర్రూరు మండలం పోలేపల్లి గ్రామంలో దశాబ్ద కాలంగా పేద ,బడుగు విద్యార్థుల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసిన కవిత, హరిత ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని తొర్రూర్ ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ అన్నారు. శుక్రవారం పాఠ శాలలో నిర్వహించిన కవిత హరిత బదిలీ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీడ్కోలు పొందిన ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపిక ,పూలమాల, సన్మాన పత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విమలాదేవి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎల్లమ్మ, ఉపాధ్యాయులు స్వాతి, కరుణాకర్, భీమా ,శ్రీనివాస్ లతో పాటుగా గ్రామ పెద్దలు సుధాకర్, షేక్ అంకుష్, అంజయ్య, వినోద్, సకినా, రాజు, శేఖర్, కేతమ్మ, జ్యోతి, పద్మ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మృతిడి కుటుంభాని పర్మార్శించిన పాలకుర్తి ఇంచార్జ్ ఝాన్సీ-రాజేందర్ రెడ్డి

తొర్రూర్ జూలై 19 జూలై వాయిస్ టూడే: తొర్రూర్ మండలం కర్కాల గ్రామము లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సెగ్గం రామ్మూర్తి ఇటీవల అనారోగ్యం తో మృతి చెంద గా ఈ రోజు వారి ఇంటి కి వెళ్లి చిత్ర పటాని కి పుస్పాంజాలి ఘటించి వారి కుటుంబ సభ్యుల ను పరామర్శించి ప్రఘాడ సానుభూతి ని తెలిపిన పాలకుర్తి నియోజక వర్గ ఇంఛార్జ్ ఝాన్సి-రాజేందర్ రెడ్డి,బ్లాక్ అధ్యక్షుడు ఆమ్యానాయక్,మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, నియోజక వర్గ సీనియర్ నాయకుడు పెద్దగాని సోమన్నగౌడ్,మాజీ మండల అధ్యక్షుడు చెవిటి.సధాకర్, మెరుగు.మల్లేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్ మల్లారెడ్డి,గ్రామ పార్టీ ముఖ్య నాయకులు,తదితరులు,పాల్గొన్నారు.

